ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు
జిల్లా వార్తలు
5
శనివారం 28 జూన్ 2025






కృత్రిమ మేధ నిపుణులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు, డీజీపీ



హైటెక్ అంటే..

హేళన చేశారు



'నేడు ప్రపంచ వ్యాప్తంగా 30 శాతం మంది తెలుగువారు సాంకేతిక నిపుణులుగా పని చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఆదాయం అర్జించే సాంకేతిక నిపుణులుగా తెలుగువారు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నారు..' : - ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.



ఆర్‌వీఆర్ జేసీ కాలేజీలో ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, తదితరులు



సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న డీజీపీ హరీష్ కుమార్ గుప్త

- ఐటీ నిపుణుల్లో నేడు 30 శాతం తెలుగువారే
- యువత కోసం రాష్ట్రంలో స్కిల్ సెంటర్స్ ఏర్పాటు
- ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్తే లక్ష్యం
- ఏఐ ఫర్ ఏపీ పోలీసు హ్యాకథాన్‌లో సీఎం చంద్రబాబు

గుంటూరు(విద్య), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): 'మూడు దశాబ్దాల క్రితమే ఐటీ గురించి ఆలోచించాను.. యువతకు ఉద్యోగ అవకాశాలే లక్ష్యంగా హైటెక్ సిటీ నిర్మిస్తే.. ఆనాడు ఎంతోమంది హేళన చేశారు. అలాంటిది నేడు ప్రపంచ వ్యాప్తంగా 30 శాతం మంది తెలుగువారు సాంకేతిక నిపుణులుగా పని చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఆదాయం అర్జించే సాంకేతిక నిపుణులుగా తెలుగువారు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నారు..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పోలీసు హ్యాకథాన్-2025ను మూడు రోజుల కార్యక్రమం శుక్రవారం గుంటూరు సమీపం చౌడవరంలోని ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి పోలీసు అధికారులు, ఐటీ నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి ఇంటి నుంచి ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగానే క్వాంటం కంప్యూటింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉద్యోగాలు పోతాయనేది వాస్తవం కాదని స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఎక్కడి నుంచైనా పని చేసే సౌలభ్యం ప్రస్తుతం యువతకు ఉందన్నారు. దీనిని సమర్థవంతంగా ఉప యోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చని చంద్రబాబు చెప్పారు. ర్యాపిడో ద్వారా గుంటూరు జిల్లాకు చెందిన యువ పారిశ్రామికవేత్త రవాణా రంగంలో సృష్టిస్తున్న సంచలనం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ

(మిగతా 8వ పేజీలో)



జిందాల్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అక్టోబర్‌కి చెత్త కనిపించ కూడదు

- డంపింగ్ యార్డులను సుందరీకరించాలి
- గత పాలకులు చెత్త పన్ను వేస్తే.. మేము సంపద సృష్టిస్తున్నాం
- జిందాల్ పవర్ ప్లాంట్ సందర్శనలో సీఎం చంద్రబాబు

8



ఉపాధికి ఊరట



- 30 శాతం బకాయిలు చెల్లింపునకు ఏర్పాట్లు
- 2014-18 లోపు బకాయిలు కూడా..
- బిల్లులు అప్‌లోడ్ చేసిన డ్వామా

గురువారం.. గురువారం బిల్లుల చెల్లిస్తా మన్నారు. తొలుత రెండు గురువారాలు బిల్లులు చెల్లించడంతో ఎగబడి మరీ కాం ట్రాక్టర్లు 'ఉపాధి' పనులు చేశారు. అప్పటి నుంచి 34 గురువారాలు గడిచినా బిల్లుల చెల్లించకపోవడంతో పనులు చేసిన వారు, పాడి రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోయారు. అయితే ప్రభుత్వం చేసిన తాజా ప్రకటనతో.. బకాయిదారుల్లో కొందరికి ఊరట లభించనుంది. మొత్తం బకాయిల్లో 30 నుంచి 35 శాతం బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు డ్వామా బకా యిల బిల్లులను సిద్ధం చేసింది. రానున్న పది రోజుల్లో బకాయిల సొమ్ము పనులు చేసిన వారికి అందే అవకాశం ఉంది.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల బిల్లులకు మోక్షం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించి సుమారు రూ.154.46 కోట్ల బిల్లులు చెల్లించాలి. తొలి విడతలో రూ.46.40 కోట్లు చెల్లించనున్నారు. 2014 నుంచి 2018 వరకు ఉపాధి పనులకు సంబంధించిన బకాయిలు కూడా 30 నుంచి 40 శాతం చెల్లించనున్నారు.

జిల్లా వారీగా చెల్లింపు ఇలా..

ఉపాధి పథకం కింద సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, నీటి తొట్లు వంటి పనులను పల్లెల్లో పెద్ద ఎత్తున చేశారు. ఈ పనులు పూర్తి చేసి 9 నెలలు గడిచిపోయింది. పల్నాడు జిల్లాలో రూ.80.49 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉండగా రూ.24.24 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.58.18 కోట్లకు రూ.17.43 కోట్లు, గుంటూరు జిల్లాలో

(మిగతా 8వ పేజీలో)



గోకులం షెడ్

సీజ్‌తోనే.. సరి

- గ్రానైట్ అక్రమ రావాణాపై చర్యలు శూన్యం
- 17 గ్రానైట్ లారీలు పట్టుకున్నా జరిమానా విధించని వైనం
- వాణిజ్య పన్నుల శాఖాధికారులపై అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రాజకీయ అండతో గ్రానైట్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కుల మధ్య తలెత్తిన వివాదాలతో లారీ నెంబర్ల సహా వాణిజ్యపన్నుల శాఖకు సమాచారం అందుతుండగా అధికారులు దాడులు చేస్తున్నారు. ఈ విధంగా ఇటీవల పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 17 గ్రానైట్ లారీలను సీజ్ చేశారు. అయితే అక్రమార్కులపై చర్యలు తీసు కోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కపెడుతున్నారన్న విమర్శలున్నాయి. లారీలు సీజ్ చేసి మూడు రోజులు గడిచినా సంబంధితులకు నోటీ సులు జారీ చేసి మిన్న కున్నారే కానీ వారిపై జరిమానాలు విధించ లేదు. ఒక్కొక్క లారీలో సుమారు 3.50 లక్షల గ్రానైట్ ఉందని అధికారులు నిర్ధారించారు. 18 శాతం పన్ను చెల్లించి వే బిల్లు ద్వారా గ్రానైట్ రవాణా చేయాల్సి ఉండగా బోగస్ బిల్లులు సృష్టించి రవాణా చేస్తున్న అంశం అధికారుల తనిఖీల్లో తేలింది. సీజ్ చేసిన లారీల్లో ఉన్న గ్రానైట్‌కు రూ.9,18,000 పన్ను చెలించాలి. అయితే అధికారం అండతో దర్జాగా జిల్లా సరిహద్దులు దాటించేందుకు అక్రమార్కులు ప్రయత్నించారని అర్థమవు తోంది. జరిమానా లేకుండా 18 శాతం పన్ను చెల్లిస్తామని అధికార పార్టీ నేతలతో అధికారులపై అక్రమార్కులు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం జరిమానా విధిస్తుందా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి వాణిజ్య పన్నుల శాఖ మిన్నకుంటుందో చూడాలి.

తప్పు చేసిన వారిని వదిలిపెట్టం

- డీసీసీబీ చైర్మన్ మక్కెన

ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది

- సర్వశిక్ష అభియాన్ డిప్యూటీ డైరెక్టర్ గీత

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రిజర్వేషన్ కోటా సవరణ

- ప్రయాణీకులకు అందుబాటులోకి రానున్న మరిన్ని బెర్తులు

6



బదిలీలు.. ప్రహసనం



- సచివాలయ సిబ్బందిలో అయోమయం
- మార్గదర్శకాలపై స్పష్టత కరువుతో గందరగోళం
- హేతుబద్ధీకరణతో పాటు బదిలీలతో గజిబిజీ
- మిగులు సిబ్బందిపై ఎటూ తేల్చని ప్రభుత్వం
- త్రిశంకు స్వర్గంలో మహిళా పోలీసుల పరిస్థితి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గ్రామ, వార్డుల సచివాలయాల్లో సిబ్బంది బదిలీల ప్రక్రియ ఓ ప్రహ సనంగా మారింది. గత ప్రభుత్వం ఏర్పా టు చేసిన ఈ సచివాలయ వ్యవస్థను క్రమబద్ధీకరిస్తామని తొలుత కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రక్రియ సాగుతుండగా బదిలీలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో గందరగోళం.. అయోమ యం.. గజిబిజీలా మారింది. ఉద్యోగుల హేతుబద్ధీకరణ చేసి సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఈ ప్రభుత్వం తలచి గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ జరుగుతుండగానే సచివాలయ ఉద్యోగుల బదిలీలకు అనుమతి ఇవ్వడంతో పాటు మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. దీంతో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పనిచేస్తున్న సచివాలయ సిబ్బందిలో దాదాపు 35 శాతం మంది బదిలీలకు అర్హులుగా తేలారు. బదిలీ దరఖాస్తుల స్వీకరణను ఈ నెల 24, కౌన్సెలింగ్ 29 వరకు చేపట్టి మొత్తం ప్రక్రియను జూలై 10లోగా ముగించేలా ప్రభుత్వం షెడ్యూల్ జారీ చేసింది. ఈ ప్రక్రియపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బదిలీల్లో ఉన్న చిక్కులపై దృష్టి పెట్టకుండానే పాలకులు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే, ఇవేవీ తమకు పట్టవన్నట్లు తాము చెప్పిన వారికి చెప్పిన చోట పోస్టింగ్ ఇవ్వాలనే నేతల సిఫార్సులతో అధికారులు అయోమయానికి గురవుతున్నారు.

మిగులు సిబ్బంది సంగతేంటి?

తాజాగా ప్రభుత్వం చేపట్టిన సచివాలయ సిబ్బంది రేషనలైజేషన్‌లో భాగంగా బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో (మిగతా 8వ పేజీలో)

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

పొన్నూరుటౌన్, జూన్ 27: మూడు పంచాయతీల ప్రజా సంపద గోల్‌మాల్ అంటూ ఏప్రిల్ 28న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందనగా పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావును డీపీవో నాగసాయికుమార్ సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని ములుకుదురు, మాచవరం, చింతలపూడి, రూ. 10 లక్షలకు పైగా నిధులు గోల్‌మాల్ అయ్యాయని మూడు గ్రామ పంచాయతీల్లో అధికారులు సమగ్ర విచారణ జరిపారు. ములుకుదురులో రూ .76,963, చింతలపూడిలో రూ.3,66,909, మాచవరంలో రూ.5,97,509 మొత్తంగా రూ రూ.10,41,381 పన్నుల సొమ్ము పంచాయతీలకి జమ కాలేదని అధికారులు విచారణలో వెలుగు చూసింది. దీనిపై నివేదిక రూపొందించిన అధికారులు జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ నాగసాయి కుమార్ కార్యదర్శి వెంకటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

వినుకొండటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మసీదు మాన్యం చివరి బజారులో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న పులి నాగేంద్రం, శీలం నాగరాజును శుక్రవారం మధ్యాహ్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ షామీర్ బాషా వెల్లడించారు. జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు.. వినుకొండ సీఐ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు చెప్పారు.

డాబా మీద నుంచి పడి వ్యక్తి మృతి

ఈపూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): డాబా మీద నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొండ్రమట్ల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బైల అడుగు రాములు (68) డాబా మీదకి వెళ్లి ప్రమాదవశాత్తూ జారి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. రాములుకి ముగ్గురు కొడుకులని, అందులో ఇద్దరు ప్రమాదాల్లో చనిపోయారు. రాములు మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది

సర్వశిక్ష అభియాన్ డిప్యూటీ డైరెక్టర్ గీత



విద్యార్థినికి బూట్లు అందజేస్తున్న సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఎస్.గీత

రాజుపాలెం, జూన్27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, ప్రతి విద్యార్థి ఇష్టపడి చదువుకోవాలని సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఎస్.గీత విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్లను పరిశీలించారు. కిట్లు మరికొంత మందికి అందాల్సి ఉందని రెండుమూడు రోజుల్లో మిగిలిన విద్యార్థులకు అందజేస్తామని చెప్పారు. పదవ తరగతి విద్యార్థులతో ఆమె కొద్దిసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదువుకుంటే అందరికి మంచి మార్కులు వస్తాయన్నారు. విద్యార్థులకు పంపిణీ చేసే కిట్స్ నాణ్యత విషయంలో రాజీ పడకుండా మంచివి ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆమె రుచి చూశారు. అదే విధంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోనూ విద్యార్థి కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జూలై 5న తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులందరు హాజరుకావాలని తెలిపారు. ఆమె వెంట అధికారులు వనజ, ఎంఈవోలు మల్లికార్జునశర్మ, నరసింహారావు, హెచ్ఎం శైలజ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో జిమ్నాస్టిక్స్‌లో ప్రతిభ చాటిన యజ్ఞశ్రీ అనే విద్యార్థినికి ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం కల్పించాలని డిప్యూటీ డైరెక్టర్ కేజీబీవీ అధికారులకు సూచించారు.

తప్పు చేసిన వారిని వదిలిపెట్టం

● డీసీసీబీ చైర్మన్ మక్కెన



మాట్లాడుతున్న చైర్మన్ మక్కెన, వేదికపై సీఈవో కృష్ణవేణి

గుంటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాల మంజూరులో అవకతవకలకు పాల్పడిన సిబ్బందిని వదిలిపెట్టేది లేదని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు హెచ్చరించారు. బ్రాడీపేటలోనున్న ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో సీఈవో కృష్ణవేణి అధ్యక్షతన శుక్రవారం బ్యాంకు వార్షిక మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా 2024-25 వార్షిక బడ్జెట్‌ను ఆమోదించారు. చైర్మన్ మక్కెన మాట్లాడుతూ బ్యాంకు రూ. 6 వేల కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. దీన్ని మరింత అభివృద్ధి చేసి మొదటి స్థానంలోకి తీసుకురావాలని సూచించారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది సమష్టిగా బ్యాంకు పురోభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం ఖరీఫ్ పంటల సాగు మొదలైన నేపథ్యంలో సీజన్‌లో రైతులకు రుణ సాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందుల్లేకుండా రైతులకు రుణాలను అందించాలన్నారు. సమావేశంలో బ్యాంకు అధికారులు, పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రైలు ప్రమాదాల.. సహాయక చర్యలపై మాక్ డ్రిల్



వేజెండ్ల వద్ద రైలు ప్రమాదంపై మాక్ డ్రిల్ చేస్తున్న రైల్వే సిబ్బంది

పొన్నూరు టౌన్(చేబ్రోలు), జూన్27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేజెండ్ల వద్ద రైలు ప్రమాదాలపై శుక్రవారం రైల్వే శాఖ అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో వేజెండ్ల, సుద్దపల్లి రైలు గేట్లకు సమీపంలో ప్రమాదం జరిగిందని పలువురికి, గాయాలు అయ్యాయని 108 వాహనాలకు సమాచారం అందించారు. చేబ్రోలు, వట్టిచెరుకూరు మండలాలకు చెందిన 108 అంబులెన్స్‌లతో పాటు రైల్వేశాఖకు చెందిన పలు వాహనాలు ఘటనా స్థలం వద్దకు హుటాహుటిన చేరుకున్నాయి. వాహనాల హడావిడి గమనించిన స్థానికులు పెను ప్రమాదం జరిగి ఉంటుందని భావించి ఘటనా స్థలానికి వచ్చారు. రైల్వేశాఖకు చెందిన ఏఆర్పీ రైలు కూడా సంఘటనా స్థలానికి చేరుకోవడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే డీఎన్ శేషు, ఇతర అధికారులు మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నామని చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమయంలో అన్ని వ్యవస్థలను అప్రమత్తంగా ఉంచడానికి ఈ రైలు మాక్ డ్రిల్ ఉపయోగపడుతుందని అధికారులు వెల్లడించారు. అలాగే రైలు పట్టాలపై తనిఖీలు నిర్వహించారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రిజర్వేషన్ కోటా సవరణ

● ప్రయాణికులకు అందుబాటులోకి రానున్న మరిన్ని బెర్తులు

గుంటూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మీదగా ప్రయాణించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రిజర్వేషన్ కోటాలను రైల్వే శాఖ సవరించింది. దీని వల్ల ప్రయాణికులు వివిధ తరగతుల బోగీలలో బెర్తులు మరిన్ని అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు శుక్రవారం రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వారంలో ఒకసారి ప్రయాణించే 12755 కాకినాడ - భావనగర్ ఎక్స్‌ప్రెస్‌లో ఫస్టు ఏసీ 10, ఏసీ టూటైర్ 23, ఏసీ త్రీటైర్ 126, ఏసీ త్రీటైర్ ఎకానమి 45, స్లీపర్ క్లాస్‌లో 31 బెర్తులు గుంటూరు రిమోట్ లొకేషన్‌లో అందుబాటులోకి రానున్నాయి. అలానే తత్కాల్, ప్రీమియం తత్కాల్ కోటాలలోనూ బెర్తుల సంఖ్యని రైల్వే శాఖ పెంచింది. తత్కాల్ కోటాలో ఏసీ టూటైర్ 32, ఏసీ త్రీటైర్ 88, ఏసీ త్రీటైర్ ఎకానమి 32, స్లీపర్ 32, ప్రీమియం తత్కాల్‌లో ఏసీ టూటైర్ 16, ఏసీ త్రీటైర్ 44, ఏసీ త్రీటైర్ ఎకానమి 16, స్లీపర్ 16 బెర్తులు ప్రయాణికులు బుకింగ్ చేసుకోవడానికి అందుబాటులోకి వచ్చాయి. అలానే ఈ రైలు జూలై 17 నుంచి ఎల్‌హెచ్‌బీ బోగీలతో ప్రయాణించనుంది. 17230 సికింద్రాబాద్ - త్రివేంద్రం శబరి ఎక్స్‌ప్రెస్‌లో గుంటూరు రిమోట్ లొకేషన్‌కు ఏసీ టూటైర్‌లో 2, ఏసీ త్రీటైర్‌లో 8, స్లీపర్ క్లాస్‌లో 26 బెర్తులు అందుబాటులోకి వచ్చాయి. తత్కాల్, ప్రీమియం తత్కాల్‌లో అయితే స్లీపర్ క్లాస్‌లో 72 బెర్తులు చొప్పున అందుబాటులో ఉంటాయి. ఏసీ టూటైర్ 16, ఏసీ త్రీటైర్ 44 బెర్తులు చొప్పున అందుబాటులోకి వచ్చాయి. 12805 విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు గుంటూరు రిమోట్ లొకేషన్ సవరించిన అనంతరం 19 ఏసీ చైర్‌కారు, 16 ఏసీ త్రీటైర్ ఎకానమి, 390 సెకండ్ సిట్టింగ్ ఉంటాయి.

ఆగస్టు 26, 28, 30 తేదీల్లో ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంటూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తాడి - దువ్వాడ సెక్షన్‌లో ట్రాక్ పనుల నిమిత్తం ఆగస్టు 26, 28, 30 తేదీల్లో ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22875 విశాఖపట్టణం - గుంటూరు, 22876 గుంటూరు - విశాఖపట్టణం ఉదయ్ ఎక్స్‌ప్రెస్ పైన పేర్కొన్న రోజుల్లో సర్వీసులు నడవవని వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కొండవీడు కోట సందర్శనకు మంత్రి లోకేశ్‌కు ఆహ్వానం

● అభివృద్ధిపై విన్నవించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి



మంత్రి లోకేశ్ ను కలిసిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కొండవీడు కోటను సందర్శించాలని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంత్రి లోకేశ్‌ను శుక్రవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి చారిత్రక పర్యాటక ప్రదేశమైన కొండవీడుకు తగిన గుర్తింపు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కొండవీడు పర్యటనకు లోకేశ్ సానుకూలంగా స్పందించినట్లు ప్రత్తిపాటి తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా త్వరలో నియోజకవర్గంలో చేపట్టబోయే పలు అభివృద్ధి పనుల గురించి లోకేశ్‌తో చర్చించినట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో నియోజకవర్గంలోని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలను లోకేశ్ కు తెలియజేసినట్లు వివరించారు. తల్లికి వందనం పథకం అమలుతో వైసీపీ చౌకబారు విమర్శలకు చెక్ పెట్టినట్లయిందని తెలిపి.. లోకేశ్‌ను అభినందించినట్లు పేర్కొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 19.58 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

చెవి దిద్దులు లాక్కెళ్లిన దుండగులకు దేహశుద్ధి

కృష్ణాపురం(శావల్యాపురం)జూన్27(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి చెవి దిద్దులను బలవంతంగా లాక్కెళ్లిన దుండగుల్ని గ్రామస్తులు వెతికి పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మండలంలోని పోట్లూరు పంచాయతీ పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. వివరాల మేరకు గ్రామానికి చెందిన వృద్ధురాలు వడ్లమూడి వెంకటరమణమ్మ కుటుంబ సభ్యులు బయటకెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉంది. దీనిని గమనించిన అదే గ్రామానికి చెందిన కొండ్రముట్ల వెంకటరామారావు, పోట్లూరి ప్రసాదు ఇద్దరూ వెంకటరమణమ్మపై దాడిచేసి చెవుల కున్న దిద్దులను బలవంతంగా లాక్కొనేందుకు ప్రయత్నించారు. దీంతో వెంకటరమణమ్మ పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల గ్రామస్తులు అక్కడికి చేరుకొన్నారు. దీంతో ఇద్దరు దుండగులు పరారై ఇంటి వెనుకనున్న శావల్యాపురం మేజర్ కాలువ గూనల్లో దాక్కున్నారు. గ్రామస్తులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేసి శావల్యాపురం పోలీసులకు అప్పగించారు. రమణమ్మ కుమార్తె పేరమ్మ ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసినట్లు ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలో సభ్యుల నియామకం

గుంటూరు (విద్య) జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిటీ పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో సభ్యుల నియామకం కోసం ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం 1989 ప్రకారం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు జూలై 5లోగా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రభుత్వ జూనియర్ కళాశాల (సత్తెనపల్లి)లో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.పద్మ శుక్రవారంలో ఒక ప్రకటనలో తెలిపారు. సివిక్స్, బోటనీలో బోధన అందించాలని, అభ్యర్థులు ఆయా సబ్జెక్టుల్లో పీజీ పూర్తి చేసి కనీసం 50 శాతం మార్కులు పొంది ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 28 లోగా దరఖాస్తు చేసుకోవాలని, 30న ఇంటర్వ్యూ, డెమో క్లాసులకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

గ్రావెల్ లారీలను అడ్డుకున్న గ్రామస్థులు



లారీని అడ్డుకున్న ఉప్పరపాలెం గ్రామస్థులు

యడ్లపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపాలెం గ్రామ పరిధిలో ఉన్న కొండ క్వారీల లారీలను గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. గ్రావెల్ తవ్వకాలు నిలిపివేయాలంటూ నినాదాలు చేశారు. ఇటీవల గ్రామస్తులు నిబంధనలకు విరుద్ధంగా క్వారీయింగ్ చేస్తున్నారని కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. క్వారీలో బ్లాసింగ్ చేయడం వల్ల తమ ఇళ్లు బీటలు వారుతున్నాయని అందులో పేర్కొన్నారు. బ్లాస్టింగ్ వల్ల పెద్ద ఎత్తున వచ్చే దుమ్ముధూళితో నీరు, గాలి కలుషితమై వ్యాధులతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో నరసరావుపేట ఆర్డీవో మధులతో క్వారీల తనిఖీలు కూడా చేపట్టారు. ఆ సమయంలో క్వారీయింగ్ నిలిపివేసి, ఆర్డీవో వెళ్లిపోగానే ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు విచారణ పూర్తయ్యే వరకు క్వారీ పనులు నిలుపదల చేయాలంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. లారీలను అడ్డుకున్న విషయం తెలుసుకున్న తహసీల్దార్ విజయశ్రీ గ్రామస్తులతో మాట్లాడారు. సీఎం పర్యటనలో ఉన్నానని, ఆర్డీవో దృష్టికి తీసుకెళ్తానని చెప్పడంతో.. గ్రామస్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి



విలపిస్తున్న కుటుంబ సభ్యులు

వినుకొండటౌన్, జూన్ 27, (ఆంధ్రజ్యోతి): మట్టి అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో విదుత్ స్తంభం విరిగి డ్రైవర్‌పై పడింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని దొండపాడు, పానకాలపాలెం గ్రామాల మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. దొండపాడు సమీపంలోని లింగమయ్య కొండ నుంచి సుమారు 20 ట్రాక్టర్ల ద్వారా పానకాలపాలేనికి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. పానకాలపాలేనికి చెందిన ఏగినాటి డ్రైవర్ మటం నాసరయ్య (52) ట్రాక్టర్‌ను మితి మీరిన వంట పొలం వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొట్టాడు. స్తంభం విరిగి విద్యుత్ వైర్లు ట్రాక్టర్ పై పడడంతో నాసరయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు. బంధువులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గృహానికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రాజధాని రైతులకు కౌలు చెల్లించాలి

సమస్యలు పరిష్కరించాలని సీఎంకు ముప్పాళ్ల లేఖ

అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాజధానికి భూములిచ్చిన రైతులకు కాలయాపన లేకుండా కౌలు చెల్లించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆయన లేఖ రాశారు. రాజధాని ప్రాంతంలో రైతులకిచ్చిన రెసిడెన్సియల్, కమర్షియల్ ప్లాట్ల అభివృద్ధికి సత్వరమే నిధులు కేటాయించి, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్తు లైన్లు తదితర మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని కోరారు. రైతులకు కష్టమొచ్చినప్పుడు తమ ప్లాట్లను బ్యాంకులో తనఖా పెట్టుకుని రుణం పొందే అవకాశం కల్పించాలన్నారు. రాజధానిలో ఉన్న విట్, ఎస్ఆర్ఎం వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఫీజుల భారాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లోని విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రారంభించి చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

చోరీకి కేసులో నిందితుడి అరెస్టు

●రూ.2 లక్షల వెండి వస్తువులు స్వాధీనం

పొన్నూరు టౌన్ (ఆంధ్రజ్యోతి) జూన్ 27: ఇటీవల జరిగిన చోరీ ఘటనలో నిందితుడిని రూరల్ పోలీసులు అరెస్టు చేసి రూ.2 లక్షల విలువైన వెండి వస్తువులను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీసుల కథనం.. ప్రకారం పొన్నూరు మండలం చింతలపూడి గ్రామంలో గత మంగళవారం జాగర్లమూడి చాముండేశ్వరి గృహంలో గుర్తుతెలియని దుండగులు బీరువాలోని 6 కిలోల వెండి సామగ్రి చోరీ చేశారు. రూరల్ ఎస్ఐ గండు కిరణ్, సీఐ వై.కోటేశ్వరరావు విచారణ చేపట్టారు. మండల పరిధిలోని బ్రాహ్మణ కోడూరు అడ్డరోడ్డు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఎస్.ఏసు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. అతని వద్ద చోరీకి గురైన వెండి వస్తువులు లభించాయి. మంగళగిరి కొత్తపేటకు చెందిన ఏసును అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ కోటేశ్వరరావు తెలిపారు మరో నిందితుడి కోసం గాలిస్తున్నట్లు వివరించారు.

40,045 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 33,890 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 40,045 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 4,408 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నెంబరు. 5	10000	13300
273	---	----
341	10000	13200
4884	---	---
సూపర్ 10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13500
షార్క్-1	---	---
బ్యాడిగి	10000	13000
దేవనూరు డీలక్స్	------	------

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9800	11000
ఏసీ కామన్ వెరైటీ		
334	9700	13000
నెంబరు. 5	10000	13300
273	10000	12500
341	10000	13400
4884	10000	12500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13600
బ్యాడిగి	10000	13000
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	4500	7000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



కిల్కారి టీమ్ నుంచి ట్రోఫీని అందుకుంటున్న డాక్టర్ విజయలక్ష్మి

కిల్కారి సేవల్లో రాష్ట్రస్థాయిలో జిల్లాకు ప్రథమస్థానం

● ట్రోఫీని అందజేసిన సెంట్రల్ కిల్కారి టీమ్

గుంటూరు మెడికల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య సమాచారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిల్కారి లిజనర్‌షిప్‌లో రాష్ట్రంలోనే గుంటూరు జిల్లాకు ప్రథమస్థానం దక్కినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి ప్రకటించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో కిల్కారి సేవలపై ఆశా నోడల్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. మే నెలకు సంబంధించిన కిల్కారి సేవల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా మొదటి స్థానంలో నిలవడం ఆనందంగా ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. గర్భిణీ నాల్గవ నెల నుంచి వారికి జన్మించే బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు వారి మొబైల్ ఫోన్‌లకు కిల్కారి కాల్స్ వస్తాయని ఆమె వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్ నెంబర్ 01244451660గా ఆమె వెల్లడించారు. కాల్ వచ్చినప్పుడు రిసీవ్ చేసుకొని పూర్తి సమాచారం తెలుసుకోవాలని డీఎంహెచ్‌వో విజ్ఞప్తి చేశారు. ఒకవేళ మరలా తిరిగి ఆ సమాచారం వినదల్చుకుంటే 14423 అనే టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి వినవచ్చన్నారు. జిల్లాలో కిల్కారి పథకంలో చక్కటి సేవలు అందించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆశాలకు డాక్టర్ విజయలక్ష్మి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ ఆఫీసర్ గోపాలకృష్ణ, రాష్ట్ర కిల్కారి మేనేజర్ ఎల్ రాజు, కిల్కారి రీజనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బీ.రాజు, డీఐవో డాక్టర్ ఏ.శ్రావణ్‌బాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ.అన్నపూర్ణ, ఇన్‌చార్జ్ డీపీహెచ్ఎన్‌వో డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు. తొలుత కేంద్ర కిల్కారి బృంద సభ్యులు డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీకి ప్రథమ బహుమతి ట్రోఫీని అందజేశారు.

నార్నే సురేఖకు డాక్టరేట్



నార్నే సురేఖ

గుంటూరు (విద్య) జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు ఎంటీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకురాలుగా పని చేస్తున్న నార్నే సురేఖకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. యూనివర్సిటీ పరిశోధన విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ కొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో 'ఆప్టిమైజేషన్ ఆఫ్ ప్రిన్సిపల్ డైమెన్షన్స్ ఆఫ్ ఏ రేడియల్ ఫ్లో గ్యాస్ టర్బైన్ రోటర్ యూజింగ్ జెనెటిక్ అల్గోరిథం అండ్ యాంట్ కాలనీ ఆప్టిమిజేషన్ అల్గోరిథం' అంశంపై చేసిన పరిశోధనకు విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రకటించినట్లు సురేఖ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేఖను కళాశాల ప్రిన్సిపల్ టి శేఖర్, మెకానికల్ విభాగం అధిపతి వీవీ కోటేశ్వరరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

సీహెచ్‌వోల సమస్యలు పరిష్కరించండి

● కమిషనర్‌కు ఏపీఎంసీఏ నేతల విజ్ఞప్తి

గుంటూరు సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండ్యన్‌ను కలిసిన అసోసియేషన్ నేతలు శుక్రవారం ప్రత్యేక వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసిన సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఆరోగ్య శాఖ మంత్రితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయటం, రాత్రి 8 గంటలకు ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయించాలని, 6 నెలల పెండింగ్ ప్రోత్సాహకాల విడుదలకు ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే అమలు పరచాలని, సర్వీస్‌తో పని లేకుండా బదిలీలకు అనుమతించాలని, సమ్మె కాలానికి జీతం ఇవ్వటంతో పాటు, ఈపీఎఫ్ సమస్యను కూడా వెంటనే పరిష్కరించాలని కమిషనర్ వీర పాండ్యన్‌కు విజ్ఞప్తి చేశారు. ఏపీఎంసీఏ నేతలు ఇచ్చిన వినతిపత్రంపై కమిషనర్ స్పందిస్తూ ఆరోగ్య శాఖ మంత్రితో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని, బడ్జెట్ వచ్చిన వెంటనే బకాయిలు విడుదల చేస్తామని, అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బిర్రు సందీప్ కుమార్, స్టేట్ కో ఆర్డినేటర్ వినోద్, వర్షిణి, నీలిమ, జిల్లా కార్యదర్శి పల్లపు లింగరాజు తెలిపారు.



వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండ్యన్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న ఏపీఎంసీఏ రాష్ట్ర కార్యదర్శి బిర్రు సందీప్ కుమార్ తదితరులు

నల్లమల జోన్ విజేతగా గుంటూరు జిల్లా

గుంటూరు(తూర్పు), జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పేరేచర్ల మైదానంలో జూనియర్ బాలుర విభాగంలో జరిగిన నల్లమల జోన్ ఫుట్‌బాల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. పోటీలలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలు పాల్గొన్నాయి. పోటీలలో పల్నాడు, గుంటూరు జిల్లాలు ఫైనల్‌కు చేరుకున్నాయి. హోరా హోరీగా జరిగిన తుది పోరులో పల్నాడు జట్టుపై 1-0 తేడాతో గుంటూరు జట్టు విజయం సాధించింది. ముగింపు కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్, కార్యదర్శి దుర్గా మోహన్‌లు పాల్గొని విజేతలకు ట్రోఫీ, సర్టిఫికెట్స్ అందజేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 29 నుంచి ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా, మదనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో గుంటూరు జిల్లా జట్టు పాల్గొంటుందని తెలిపారు.



పోటీలలో పాల్గొన్న క్రీడాకారులతో అధ్యక్షుడు కుమ్మరి కాంత్రికుమార్, కోచ్‌లు

వైభవంగా జగన్నాథ స్వామి రథోత్సవం



కొత్తపేటలో జరుగుతున్న జగన్నాథ స్వామి రథోత్సవం

గుంటూరు కార్పొరేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కొత్తపేటలోని బాల సుభద్ర జగన్నాథ స్వామి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఒరిస్సా రాష్ట్రం పూరిలోని శ్రీ జగన్నాథస్వామి రథయాత్రను పురస్కరించు కొని శుక్రవారం గుంటూరులో శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానం నుంచి నగరంలో రథయాత్ర నిర్వహించారు. రథోత్సవంలో భక్తులు గుంటూరు నగరంలోని ఒరిస్సా రాష్ట్రానికి చెందిన భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయం అసిస్టెంట్ కమిషనర్ టి.సుభద్ర, దేవస్థానం అర్చక అయోధ్య, అయ్యప్ప, మురళి చంద్రకుమార్ గోపాలకృష్ణ, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 1.39 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించడానికి శంకుస్థాపన చేయడం జరిగిందని నగర మేయర్ కోవేలమూడి రవీంద్ర తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలోని 20, 22వ డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో కుల, మత, పార్టీలకతీతంగా వివిధ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. శివారు ప్రాంతాలలో చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిని అరికట్టేందుకు నిరంతరం నిఘా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. పారిశుద్ధ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపించి, రోడ్లపై చెత్త పేరుకుపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పనులు చేస్తున్న గుత్తేదార్లు పనులను నిర్దేశిత సమయంలో నాణ్యతాప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గేదెల నాగరంగమణి, నిమ్మల వెంకట రమణ, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ రవీంద్ర, పక్కన ఎమ్మెల్యే మాధవి తదితరులు

సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన మేయర్, ఎమ్మెల్యేలు



ఆర్‌వీఆర్ అండ్ జేసీ కాలేజీలో నిర్వహిస్తున్న ఏఐ హ్యాకథాన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు, జిందాల్ ప్లాంట్‌ను సందర్శించేందుకు గుంటూరు నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), గుంటూరు తూర్పు, పశ్చిమ, మాచర్ల ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, గల్లా మాధవి, బ్రహ్మానందరెడ్డి - గుంటూరు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా శ్యామలానగర్, సాయినగర్, స్తంభాల గరువు, పాత పట్టాభిపురం పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్-2 డిప్యూటీ ఈఈ ఎన్.గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

వయసు రీత్యా ఎదురవుతున్న వ్యాధులపై రేపు ఆరోగ్యసభ

గుంటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : వయస్సు రీత్యా ఎదురవుతున్న వ్యాధులపై అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11 గంటలకు అరండల్‌పేట 15/1వ లైనులోని కార్యాలయంలో ఆరోగ్యసభ నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సభలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రావిళ్ళ గీత హాజరై ప్రసంగిస్తారన్నారు. వయస్సు పెరిగే కొద్దీ ఎదురవుతున్న వ్యాధులు, జీవనశైలిలో ఎలాంటి మార్పులు చేసుకోవాలి, జబ్బులను ముందుగానే ఎలా గుర్తించాలి వంటి అంశాలను వివరిస్తారన్నారు.



శాలువాకప్పి నూతన ఏడీఏ ఎస్.మోహన్‌రావు కు శుభాకాంక్షలు తెలుపుతున్న పలు మండలాల వ్యవసాయ అధికారులు


గుంటూరు ఏడీఏగా మోహన్‌రావు

గుంటూరు సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు ఏడీఏగా ఎస్.మోహన్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా పర్చూరులో పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం తాజా బదిలీలలో గుంటూరుకు మార్చటం జరిగింది. నూతన ఏడీఏగా బాధ్యతలు స్వీకరించిన మోహన్‌రావు మాట్లాడుతూ రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటానని చెప్పారు. గుంటూరు పరిసర ప్రాంతాల్లో వ్యవసాయం ఎక్కువగా జరుగుతున్నందు వల్ల అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అనంతరం ఆయన జిల్లా వ్యవసాయ అధికారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏవోలు ఖడ్గం రమణ కుమార్, బుల్లా కిషోర్ తదితరులు కొత్త ఏడీఏను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బదిలీ అయిన టీచర్ల జీతాల సమస్యలు పరిష్కరించండి

గుంటూరు(విద్య),జూన్ 27(ఆంధ్రజ్యోతి): పదోన్నతులు పొందిన టీచర్ల ఎస్ఆర్‌లు అప్ టు డేట్ చేసి ఎల్‌పీసీలు ఇవ్వాలని గుంటూరు తూర్పు ఎంఈఓ ఎండీ ఖుద్దూస్‌కు యూటీఎఫ్ నగర శాఖ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మంగళగిరి కార్పొరేషన్ నుంచి బదిలీపై గుంటూరు కార్పొరేషన్ వచ్చిన ఉపాధ్యాయుల ఎస్ఆర్‌లు, ఎల్‌పీఎస్‌ల కోసం మంగళగిరి ఎంఈఓకు లేఖ పంపాలని సూచించారు. అదేవిధంగా ఎస్జీటీ నుంచి పీఎస్ హెచ్‌ఎంగా పదోన్నతి పొందిన వారికి ఇంక్రిమెంట్లు మంజూరు చేసి పే ఫిక్సేషన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బెల్లంకొండ ప్రసాదు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు ఎం కోటిరెడ్డి, నగర అధ్యక్షుడు చిన్నయ్య, నగర కమిటీ సభ్యులు రెహమాన్, శివరామిరెడ్డి, చంద్రశేఖర్, నరసింహారావు, షబ్బీర్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

మూత్ర సమస్యలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ ఆరె కార్తీక్, పాల్గొన్న చేకూరి సింధూశ్రీ తదితరులు

గుంటూరు (తూర్పు), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం, గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ డాక్టర్లచే మూత్ర సమస్యలపై అవగాహన సదస్సు జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ న్యూరాలజిస్టులు ఆరె డాక్టర్ కార్తీక్, చేకూరి సింధూశ్రీలు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తూ మూత్ర సమస్యలపై అవగాహన చాలా ముఖ్యమన్నారు. మూత్ర వ్యవస్థకు సంబంధించిన సమస్యలు సాధారణంగా మహిళల్లో, పురుషులలో కనిపిస్తాయన్నారు. మూత్ర మార్గ సంక్రమణ, మూత్రం ఆపుకొనలేని స్థితి, రక్తం రావడం, తక్కువ మూత్ర విసర్జన, మూత్ర విసర్జనలో ఇబ్బంది వంటి సమస్యలకు కారణాలని అన్నారు. వ్యాధి లక్షణాలను గుర్తించి వాటి నివారణ చర్యలను తెలుసుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షుడు మన్నె సుబ్బారావు పర్యవేక్షించారు.



జీఎంసీ ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

కార్మికుల జీతాలు పెంచకపోవడంతోనే సమ్మె

● ఇంజనీరింగ్ విభాగం జిల్లా కన్వీనర్ పూనేపల్లి

గుంటూరు కార్పొరేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచకపోవటంతో గత్యంతరం లేక నిరవధిక సమ్మెకు పూనుకుంటున్నారని, తరువాత నగర ప్రజలకు కలిగే అసౌకర్యానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఇంజనీరింగ్ విభాగం జిల్లా కన్వీనర్ పూనేపల్లి శ్రీనివాసరావు హెచ్చరించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జులై 4వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ లో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల రాష్ట్రవ్యాప్త మహా ధర్నా జరుగు తుందని, ఈ ధర్నాలో సమ్మె తేదీని ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నాయకులు పాశం పూర్ణచంద్రరావు, కాటమరాజు, కుమార్, రత్నబాబు, రసూల్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గుంటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో పచ్చదనాన్ని పెంచేలా పర్యావరణను పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) తెలిపారు. గుంటూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వారి సహకారంతో కార్పొరేటర్ ఆచారి ఆధ్వర్యంలో బ్రాడీపేటలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ వృక్షాలను ఇష్టానుసారంగా కొట్టివేయటంతో నేడు నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ మారెడ్డి బసివిరెడ్డి, బ్యాంకు డైరెక్టర్లు రామారావు, బందా రవీంద్రనాథ్, సంజీవరావు, డివిజన్ నాయకులు వలివేటి వెంకటరమణ, మహేంద్ర గులేచా తదితరులున్నారు.

క్రికెట్ పోటీలలో విజేతలుగా నల్లపాడు, చిత్తూరు జట్లు

గుంటూరు(తూర్పు), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు, లయోలా పబ్లిక్ పాఠశాల క్రీడా మైదానంలో అండర్-14, 17 బాలుర విభాగంలో జరిగిన ఏపీసీఐఎస్‌సీఈ పాఠశాలల అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు హోరా హోరీగా సాగాయి. పోటీలలో దాదాపు పదికిపైగా పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జరిగిన పోటీలలో అండర్-14 విభాగంలో లయోలా పబ్లిక్ స్కూల్- నల్లపాడు విజేతగా నిలవగా, ఎంఎస్ రెఫరల్ హాస్పటల్ స్కూల్-చిత్తూరు, స్టెమ్ స్కూల్-గుంటూరు జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్నాయి. అండర్-17 విభాగంలో ఎంఎస్ రెఫరల్ హాస్పిటల్స్ స్కూల్ - చిత్తూరు విజేతగా నిలువగా, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్- కడప, శ్రీ వేద స్కూల్-చిత్తూరు పాఠశాలలు ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్నాయి. ముగింపు కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ పి.ఆంటోని, ప్రిన్సిపాల్ ఫాదర్ సగాయ రాజ్ మార్క్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ నరేష్ పాల్గొని విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ అందించి క్రీడాకారులను అభినందించారు.

ప్రతి కౌలు రైతు గుర్తింపు కార్డు పొందాలి

గుంటూరు(తూర్పు), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి కౌలు రైతు గుర్తింపు కార్డు పొందాలని జిల్లా వ్యవసాయాధికారి యూ.నరసింహారావు అన్నారు. రూరల్ పరిధిలోని చినపలకలూరు రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. గుర్తింపు కార్డు ఉన్న ప్రతి రైతుకు క్రాప్ రుణం, ఇన్సూరెన్స్, నష్టపరిహారంతో పాటు విత్తనాలు, ఎరువులపై రాయితీలు వర్తిస్తాయన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీపై జనుము విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఏవో బి.కిషోర్, పంచాయితీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనగర్‌లో వీధి కుక్కల స్వైరవిహారం

● విద్యార్థులపై దాడి.. ఒకరికి గాయాలు



కుక్కదాడితో విద్యార్థి కాలికి గాయం

గుంటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నల్లపాడు రోడ్డులోని శ్రీ లక్ష్మీనగర్‌లో వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. ఉదయం పాఠశాలకు వెళ్ళే విద్యార్థులపై దాడి చేశాయి. జశ్వంత్‌రెడ్డి అనే విద్యార్థి కాలుకు గాయం కాగా సహచర విద్యార్థులు సైకిళ్ళు పడేసి పరారయ్యారు. ఇంతలో స్థానికులు ఒక్కసారిగా కేకలు వేయటంతో వీధి కుక్కలు పరారయ్యాయి. వీధి కుక్కల దాడితో కాలనీలో వృద్ధులు, చిన్నారులు బయటకు రావాలంటేనే భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ర్యాపిడోని సృష్టించింది గుంటూరు నివాసే

● సీఎం చంద్రబాబు నాయుడు

గుంటూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా నిత్యం లక్షలాది మంది ప్రయాణానికి వినియోగించే ర్యాపిడో యాప్‌ని రూపొందించింది గుంటూరు జిల్లా నివాసేనని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ర్యాపిడో యాప్ రూపకల్పనలో కో ఫౌండర్‌గా ఉన్న పవన్ గుంటుపల్లి కుటుంబం కొన్నేళ్ల క్రితమే నిజామాబాదుకు వలస వెళ్లిందన్నారు. ఆయన తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా ఉండేవారు. ఆ సమయంలో తాను ఐటీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరుని నిశితంగా గమనించేవారు. ఐఐటీలో చదువుకున్న పవన్ కుమార్ గొప్పగా ఆలోచన చేసి ర్యాపిడోని కనుగొన్నారు. వాహన యజమాని, డ్రైవరు, వినియోగదారుడిని ఒక ప్లాట్‌ఫామ్ పైకి తీసుకొచ్చారు. వినియోగదారుల నుంచి యాప్‌లో బుకింగ్ నొక్కగానే సమీపంలోని ఐదు వాహనాలకు సందేశం వెళుతుంది. వాళ్లలో ఎవరు ముందుగా స్పందిస్తే వాళ్లకు రైడ్ బుక్ అవుతుంది. రైడు ముగిసిన తర్వాత రేటింగ్ కూడా వినియోగదారుల నుంచి ఆన్‌లైన్లో స్వీకరిస్తారు. దేశవ్యాప్తంగా ర్యాపిడో వ్యాపారాన్ని విస్తరించి నేడు బిలియన్ డాలర్ల టర్నోవర్‌కు చేరుకుంది. ఒక సామాన్య టీడీపీ కార్యకర్త ఈ విధమైన ఆలోచన చేసి ముందుకు వెళితే మీరు చేయలేరా అని విద్యార్థులను సీఎం చంద్రబాబు చైతన్యపరిచారు.

అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తాం

● ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పొత్తూరువారితోట గవర్నమెంట్ ఉర్దూ అంగన్వాడీ స్కూల్ (బావుడి స్కూల్)లో శుక్రవారం జరిగిన ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే అంగన్వాడీలను సీఎం చంద్రబాబు పటిష్టంగా మారుస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 11,400 అంగన్వాడీ కేంద్రాల్లో ఇండక్షన్ స్టవ్‌లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గుంటూరు తూర్పు నియోజ కవర్గంలో రూ.16.70 లక్షల ఖర్చుతో ఇండక్షన్ స్టవ్‌లు అందించామన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, గర్భిణులకు బాలామృతం, అమృతహస్తం, గోరు ముద్ద, బాల సంజీవని, పాలు, గుడ్లు వంటి పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. రాబోయే ఏడాది కాలంలో అంగన్వాడీ కేంద్రాల ఆధునీకీకరణతో పాటు పోషకాహారం, విద్య, ఆరోగ్య సేవలను గ్రామస్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. గుంటూరు తూర్పు నియోజ కవర్గంలో మొత్తం 3,230 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందుతుందని తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో తొమ్మిది అంగన్వాడీ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్లు, ఎల్లావుల అశోక్, పోతురాజు సమత, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, కొనకల సత్యం, కుద్దూస్, వెంకట్, పిచ్చిరెడ్డి, పారుక్, వంగర ఏడుకొండలు, పద్మావతి, విజయ్, భాషి తదితరులు పాల్గొన్నారు.



ఇండక్షన్ స్టవ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

రాష్ట్రంలో పారిశ్రామిక రంగం పరుగులు

● ఏపీఐడీసీ చైర్మన్ డేగల

గుంటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటు దిశగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. ఏపీఐడీసీ కార్యాలయంలో ఛైర్మన్ డేగల ప్రభాకర్ అధ్యక్షతన శుక్రవారం కార్పొరేషన్ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్పొరేషన్ పురోగతి కోసం కావాల్సిన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ప్రభాకర్ మాట్లాడుతూ నూతన పరిశ్రమల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అనేక రకాల రాయితీలను కల్పిస్తుందన్నారు. ఏపీఐఐసీ, ఎంఎస్ఎంఈలతో సమన్వయం చేసుకొని పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేసేందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలను స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారని అన్నారు. సంస్థాగతంగా ఉన్న సమస్యలను అధిగమించి కార్పొరేషన్‌ను ముందుకు తీసుకెళ్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారన్నారు. కార్పొరేషన్‌కు ప్రస్తుతం తగినంత సిబ్బంది కూడాలేరని, ఉద్యోగులను త్వరితగతిన భర్తీ చేస్తామన్నారు.



ఏపీఐడీసీ సమావేశంలో ఛైర్మన్ డేగల ప్రభాకర్

కేంద్ర ఆరోగ్య పథకం ఎల్ఏసీ సభ్యుడిగా సీతారామయ్యచౌదరి

గుంటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా గుంటూరుకు చెందిన సెంట్రల్ జీఎస్టీ విశ్రాంత సూపరింటెండెంట్ గుమ్మడి సీతారామయ్యచౌదరి నియమితుల య్యారు. ఈ మేరకు సీజీహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన రెండేళ్ళ పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు తరుపున నియమితులైన సీతారామయ్యచౌదరిని శుక్రవారం కన్నావారితోటలోనున్న కార్యాలయంలో సెంట్రల్ జీఎస్టి గుంటూరు కమిషనర్ సుజిత్ మల్లిక్ ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. కమిషనర్ మల్లిక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య పరిరక్షణకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సీతారామయ్య చౌదరి కృషి చేయాలని సూచించారు. సీజీహెచ్ఎస్ ఎల్ఏసీ మెంబర్ సీతారామయ్య చౌదరి మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు తన వంతు విశేషంగా కృషి చేస్తానన్నారు. విశ్రాంత జీవితంలో సేవ చేసే బాధ్యత ఇచ్చిన సీజీహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రోహిణికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీతారామయ్యచౌదరిని పుష్పగుచ్ఛాలతో పలువురు ఉద్యోగులు అభినందించారు. కార్యక్రమంలో ఏపీ సెంట్రల్ జీఎస్టీ పెన్షనర్ల సంఘ నేతలు టి.వివేకానంద, గద్దె తిలక్, పీవీ సత్యనారాయణ, పి.కోటేశ్వ రరావు, ఎన్ఎస్ నగేష్ బాబు, కె.సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.



సీతారామయ్యచౌదరిని సత్కరిస్తున్న కమిషనర్ సుజిత్ మల్లిక్



అక్టోబర్ నాటికి చెత్త కనిపించకూడదు

- డంపింగ్ యార్డులను సుందరీకరించాలి
- గత పాలకులు చెత్త పన్ను వేస్తే.. మేము సంపద సృష్టిస్తున్నాం
- జిందాల్ పవర్ ప్లాంట్ సందర్శనలో సీఎం చంద్రబాబు

గుంటూరు(కార్పొరేషన్), యడ్లపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జూన్ 27(ఆంధ్రజ్యోతి): అక్టోబర్ నాటికి రాష్ట్రంలోని డంపింగ్ యార్డ్ల్లో ఎక్కడా చెత్త కుప్పలు కనిపించడానికి వీల్లేదని, వాటిని సుందరీకరించి ప్రజలకు మంచి ఆహ్లాదాన్ని అందించే పార్కుల్లా తీర్చిదిద్దాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గత పాలకులు చెత్తపై పన్నులేసి ప్రజల్ని దోచుకుంటే తాము చెత్త నుంచి సంపద సృష్టిస్తూ, ప్రజలకు ఆదాయం వచ్చేలా చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలోని ఎడ్లపాడు మండలం కొండవీడులో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే జిందాల్ పవర్ ప్లాంట్‌ను సీఎం చంద్రబాబు నాయుడు శుక్రవారం సందర్శించారు. ప్లాంట్‌లో వ్యర్థాలను వేరు చేయడం, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విజయవాడ, గుంటూరుతో పాటు మొత్తం 12 మున్సిపాలిటీల నుంచి ఘన వ్యర్థాలను ఈ ప్లాంట్‌కు తరలిస్తున్నారని, ప్రతి రోజూ 1,400 మెట్రిక్ టన్నుల చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి అవుతోందని అధికారులు సీఎంకు వివరించారు. వేస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంట్‌ను పరిశీలించిన సీఎం చెత్త నిర్వహణపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

సీఎంకు ఘనస్వాగతం

గుంటూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుకు జిందాల్ ప్లాంట్‌లోని హెలిప్యాడ్ వద్ద పల్నాడు, గుంటూరు జిల్లాల నాయకులు ఘన స్వాగతం పలికారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, ప్రత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, తెనాలి శ్రావణ్‌కుమార్, బూర్ల రామాంజనేయులు, చదలవాడ అరవిందబాబు, నసీర్ అహ్మద్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఏపీఐఐసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, పార్టీ నాయకులు చిట్టాబత్తిన శ్రీనివాసరావు తదితరులు సీఎంకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. జిందాల్ ప్లాంట్ సందర్శనలో మంత్రి నారాయణ, హోం మంత్రి అనిత పాల్గొన్నారు.

ప్రజా రక్షణ కోసం.. కృత్రిమ మేధ



ఏఐ నిపుణులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు, పక్కన మంత్రులు పెమ్మసాని, అనిత, డీజీపీ

- కృత్రిమ మేధ నిపుణులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి
- పోలీసుశాఖకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలని విజ్ఞప్తి
- ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాలలో ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం



గుంటూరు (విద్య) జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (కృత్రిమ మేధ) పాత్ర భవిష్యత్తులో ఎంతో కీలకం కానుందని, ప్రజారక్షణ, సంక్షేమం కోసం అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని కృత్రిమ మేధ ద్వారా అందుబాటులోకి తీసుకురావాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. చౌడవరంలోని ఆర్ వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఏఐ హాకథాన్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్ర బాబు దేశంలోని పలు కృత్రిమ మేధ నిపుణులతో ముఖాముఖి చర్చ నిర్వహించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటిసారిగా ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ విభాగం వినూత్నంగా ఇటువంటి సాంకేతిక సదస్సును నిర్వహిస్తోందని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు అవసరమైన నైపుణ్యాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులు పోలీసు విభాగానికి అందించాలని సూచించారు. నేర పరిశోధనలో మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దోషులను సులభంగా పట్టుకుని, శిక్షించే అవకాశం ఏఐ ద్వారా కలుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 160 ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకోగా వాటిలో 50 సంస్థలను ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులు సీఎం చంద్ర బాబుకు తమ సంస్థ పోలీస్ విభాగానికి అందించే సేవలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజ నేయులు పాల్గొన్నారు.



ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభించిన సీఎం

ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ సెంటర్‌ను సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ ఈ సెంటర్ ద్వారా సాంకేతిక విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చి- వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా (స్టార్టప్ నిపుణులు) తయారు చేయడం లక్ష్యమని వివరించారు. కంపెనీ అవసరాలకనుగుణంగా శిక్షణ ఇస్తూ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు.



కేంద్రమంత్రి పెమ్మసానికి జ్ఞాపికను అందజేస్తున్న డీజీపీ హరీష్ కుమార్ గుప్తా



సీఎం చంద్రబాబు నాయుడుకి మెమెంటో అందజేస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్





ఆర్‌వీఆర్ జేసీ కళాశాలలో జరిగిన సమావేశంలో పాల్గొన్న వివిధ జిల్లాల ఎస్పీలు, కళాశాల విద్యార్థులు

ఉపాధికి ఊరట.!

(5వ పేజీ తరువాయి)

రూ.15.79 కోట్లకు రూ.4.73 కోట్లు బిల్లులు చెల్లించనున్నారు. ఈ మేరకు జిల్లాల వారీగా బిల్లులను అప్‌లోడ్ చేశారు. ఈ పనులతో పాటు పాడి రైతులు నిర్మించుకున్న గోకులాలకు కూడా బిల్లులు చెల్లించలేదు. గోకులాల షెడ్‌లకు సబంధించి పల్నాడు జిల్లాలో రూ. 6.03 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.6.23 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.1.26 కోట్లు చెల్లించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

2018కు ముందు బకాయిలు కూడా..

గత టీడీపీ ప్రభుత్వం హయాంలో 2014 నుంచి 2018 లోపు ఉపాధి పథకం కింద చేసిన పనులకు సంబంధించి బిల్లుల బకాయిలు చెలించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. వైసీపీ ప్రభుత్వం హయాంలో సదరు బిల్లులను విత్‌హెల్డ్‌లో ఉంచారు. ఈ బిల్లులను తిరిగి అమోదించారు. మూడు జిల్లాల్లో రూ.70 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్లు పంచాయతీరాజ్ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఏడేళ్లుగా పేరుకుపోయిన బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో సదరు పనులు నిర్వహించిన వారికి ఊరట లభించనుంది. బిల్లుల అప్‌లోడ్ చేశామని రానున్న వారంలో బిల్లుల చెల్లింపులు జరిగే అవకాశం ఉందని డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి తెలిపారు.

బదిలీలు.. ప్రహసనం

(5వ పేజీ తరువాయి)

దాదాపు 2,200 వరకు మిగులు సిబ్బంది ఉన్నట్లు లెక్కతేల్చారు. వీరిని నూతన మార్గదర్శకాల ప్రకారం కొత్తగా కొలువుదీరే సచివాలయాలతో పాటు జనాభా ప్రామాణికంగా సర్దుబాటు చేయాలనేది ప్రభుత్వ ఆలోచన. మిగులు సిబ్బందిలో అధిక శాతం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఉండగా బాపట్ల జిల్లాలో వీరి సంఖ్య చాలా స్వల్పంగా ఉంది. బదిలీల్లో భాగంగా వీరిని ఎలా సర్దుబాటు చేయాలనే దానిపై ప్రభుత్వానికే స్పష్టత లేకపోవడం గమనార్హం. నూతన జిల్లాలో సచివాలయ సిబ్బంది వివిధ శాఖల్లో డిప్యుటేషన్‌పై రెండేళ్ల నుంచి పనిచేస్తున్నారు. వీరి విషయంలోనూ గందరగోళమే. ఇలాంటి వారి సంఖ్య మూడు జిల్లాల పరిధిలో దాదాపు 450 వరకు ఉన్నట్లు సమాచారం. బాపట్ల, పల్నాడు జిల్లాల్లోనే దాదాపు కనీసం 900 మంది వరకు సిబ్బంది కొరత ఉన్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఈ పరిస్థితుల్లో సచివాలయాల్లో మిగులు ఉన్న సిబ్బందిని ఆయా ఖాళీల్లో భర్తీ చేసే విధంగా ప్రణాళికలు రచించింది. ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటైన విజన్ కమిటీల్లో కూడా సచివాలయ సిబ్బందినే ఐదుగురిని కేటాయించిన సంగతి తెలిసిందే. ఇన్ని బాలారిష్టాల మధ్యనే బదిలీల తంతు జరుగుతుండడం విస్మయపరిచేదిలా ఉందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేం ఏ విభాగం కిందకి వస్తాం..

సచివాలయ మహిళా పోలీసుల పరిస్థితి అయితే ఘోరంగా ఉంది. మూడు జిల్లాల పరిధిలో ఉన్న దాదాపు 1,700 మంది మహిళా పోలీసులను ఐసీడీఎస్ గొడుకు కిందకు తేవాలనే ప్రతిపాదనను ఇటీవల ప్రభుత్వం తెచ్చింది. తర్వాత దానిని అటకెక్కించింది. పోలీసు విభాగం కిందనే ఉంచాలనేది ఇంకో నిర్ణయం. ఇదీ ఆచరణ దాల్చలేదు. ఇప్పుడు బదిలీల్లో వీరికి ఇచ్చే ఆప్షన్లు మొదలుకుని విభాగం వరకు అంతటా గందరగోళమే.

ఈపీఎఫ్ హయ్యర్ పెన్షన్ ఆప్షన్‌లను పరిశీలించాలి



పీఎఫ్ కార్యాలయం ఎదుట ప్రదర్శన చేస్తున్న యూనియన్ నాయకులు

గుంటూరు(తూర్పు), జూన్ 27(ఆంధ్రజ్యోతి): తిరస్కరించిన విద్యుత్ ఉద్యోగుల ఈపీఎఫ్ హయ్యర్ పెన్షన్ ఆప్షన్‌లను పరిశీలించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (యూఈఈయూ) అధ్యక్ష, కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, ఎల్.రాజు కోరారు. ఈ మేరకు గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లో ఉన్న పీఎఫ్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీసీపీడీసీఎల్ పరిధిలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు. ప్రకాశం జిల్లాల్లో దాదాపు 2,834 మంది ఉద్యోగులు ఈపీఎఫ్‌వోకు దరఖాస్తు చేయగా, కేవలం 619 మందికి మాత్రమే పెన్షన్ నిమిత్తం డిమాండ్ నోటీసులు అందాయని తెలిపారు. మిగిలిన 2,215 ఉద్యోగుల దరఖాస్తులను తిరస్కరించారని తెలిపారు. చిన్న చిన్న కారణాలతో ఆప్షన్‌లను తిరస్కరించడం సరైన విధానం కాదన్నారు. పాత పెన్షన్ అమలు గాక, హయ్యర్ పెన్షన్ ఆప్షన్‌లను తిరస్కరించడంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ పెన్షన్‌కు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు లక్ష్మణరావు, వీరాంజనేయులు, రామ్‌ప్రభాకర్, నాగేశ్వరరావు, రోహిణి కుమార్, బాబుప్రసాద్ పాల్గొన్నారు.

హైటెక్ అంటే.. హేళన చేశారు

(5వ పేజీ తరువాయి)

అని చెప్పారు. రాష్ట్రంలో గుంటూరు, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, కర్నూలు తదితర ప్రాంతాల్లో స్కిల్ సెంటర్స్ ఏర్పాటు చేసి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణను యువతకు అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో క్వాంటం కంప్యూటర్ ద్వారా ఉద్యోగ అవకాశాలు విస్తృతం కానున్నట్లు చెప్పారు. హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ నేర పరిశోధనలో మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడమే లక్ష్యంగా ఏఐను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.


సాంకేతికతకు ఆద్యుడు చంద్రబాబు

హైటెక్ సిటీని నిర్మించి ప్రపంచ వ్యాప్తంగా ఐటీ నిపుణులు తయారు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్‌తో పాటు నాడు మీ సేవ, ప్రభుత్వ కార్యాలయాల్లో డిజిటలైజేషన్, బయోమెట్రిక్ ప్రక్రియలకు శ్రీకారం చుట్టింది చంద్రబాబేనన్నారు. క్వాంటం కంప్యూటర్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సీఎం ఆలోచిస్తున్నారన్నారు. సమస్యకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా ఏఐ పనిచేస్తుందని, మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ముందంజలో ఏపీ పోలీస్ : డీజీపీ

జాతీయస్థాయిలో మొట్టమొదటి సారి ఏఐ ద్వారా రానున్న రోజుల్లో చట్టాన్ని అమలును చేసేలా హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నట్లు డీజీపీ హరిష్‌కుమార్‌గుప్తా చెప్పారు. రాష్ట్ర పోలీస్ విభాగం మొదటి నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలో దేశంలో ముందు ఉందన్నారు. గతంలో ఏపీ పోలీస్ రూపొందించిన ఈ-శాప్ ప్లాట్‌ఫామ్ సీసీటీఎన్ఎస్‌గా మారీ జాతీయస్థాయిలో ప్రామాణికంగా ఉందన్నారు. ప్రస్తుతం కృత్రిమ మేధను ప్రధాన పాత్రగా చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మూడు నెలలు క్రితమే పుట్టిన హ్యాకథాన్ ఆలోచనను 30 మంది సీనియర్ ఐపీఎస్‌లు, 4సైట్ ఏఐ నాలెడ్జ్ భాగస్వామితో కలసి నిర్వహిస్తున్నామన్నారు. సిలికాన్ వ్యాలీ, గ్లోబల్ ఏఐ కమ్యూనిటీ బృందాలు ఈ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి, ఐపీఎస్ ఆఫీసర్ దీపికాపాటిల్, ఐజీ ఆపరేషన్ అండ్ టెక్నికల్ సర్వీసెస్ శ్రీకాంత్, ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బుర్ల రామాంజనేయులు, ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అద్వికా'లో అంతా పెద్దవారే!



విజయవాడలోని అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయం

- పెట్టుబడులు పెట్టినవారంతా ప్రముఖులే..
- ప్రభుత్వ అధికారులు, రాజకీయ నేతలే ఎక్కువ
- లిస్టులో పోలీసులు, వైద్యులు కూడా..
- కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఏలూరు జిల్లాలవారు
- ట్రేడింగ్ కంపెనీ, పీఎస్‌కు బాధితుల క్యూ
- అధిక వడ్డీ ఆశచూపి ఆకర్షించిన ఎండీ ఆదిత్య
- 1,200 మంది ఖాతాదారులు.. రూ.300 కోట్ల పెట్టుబడి
- బోర్డు తిప్పేయడంతో లబోదిబోమంటున్న బాధితులు
- సొమ్మంతా హవాలాలో దుబాయి చేరినట్టు గుర్తింపు
- ల్యాప్‌టాప్‌లో బయటపడిన ఆదిత్య రాసలీలలు

విజయవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రూ.లక్ష పెట్టుబడి పెడితే, నెలకు రూ.6 వేలను వడ్డీగా చెల్లిస్తామని చెప్పి ఏజెంట్లు, ఖాతాదారులకు ఝలక్ ఇచ్చిన విజయవాడలోని అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్యతో పాటు కిరణ్ అనే ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. అయితే, ఆదిత్య చేసిన లీలలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. 1,200 మంది ఖాతాదారుల నుంచి రూ.300 కోట్లను పెట్టుబడిగా వసూలుచేసి బోర్డు తిప్పేయడంతో ఈయన లీలలు వెలుగులోకి వస్తున్నాయి. ఆదిత్య.. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎదురుగా, ఈఎస్ఐ రోడ్డులో ఉన్న ఫార్చ్యూన్ హైట్స్‌లో అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని నిర్వహిస్తున్నాడు. ఐదేళ్ల కిందట ప్రారంభించాడు. పెట్టుబడి పెట్టినవారికి నెలకు రూ.6 వేల వడ్డీని గత డిసెంబరు వరకు చెల్లించాడు. ఆ తర్వాత నుంచి చెల్లింపులు ఆలస్యమయ్యాయి. దీంతో కొంతమంది పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగింది. ఆదిత్య ఇస్తున్న వడ్డీ సాధారణ, మధ్య తరగతి వారినే కాదు.. ప్రముఖులను కూడా ఆకర్షించింది. రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, పోలీసులు, వైద్యులు ఇక్కడ లక్షలు పెట్టుబడి పెట్టారు. రాష్ట్రమంత్రి అనుచరులు, కేంద్రమంత్రి సహాయకులు కూడా ఉన్నట్టు తెలిసింది. ఇలా పెట్టుబడులు పెట్టిన వారికి అసలు ఆదిత్య అంటే ఎవరో తెలియదు. అతని ముఖం కూడా చూడలేదు. కొంతమంది ప్రత్యక్షంగా వారి కుటుంబ సభ్యుల పేర్లతో పెట్టుబడులు పెట్టగా, మరికొందరు స్నేహితుల ద్వారా డబ్బు పెట్టించారు. ఒకప్పుడు భవానీపురం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి, ఇప్పుడు నిఘా విభాగంలో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ రూ.50 లక్షలను తన స్నేహితుడి ద్వారా పెట్టుబడి పెట్టించాడు. అలాగే, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఏలూరు జిల్లాలకు చెందిన రాజకీయ నేతలు.. వారి అనుచరుల ద్వారా పెట్టుబడులు పెట్టించారు. ఆదిత్యతో పాటు అతడి స్నేహితుడినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పత్రికల్లో రావడంతో ఖాతాదారులు కంపెనీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఇప్పటికే మాచవరం పోలీసులు ఆదిత్య, కిరణ్‌పై కేసు నమోదు చేశారు. శుక్రవారం మరో 20 మంది బాధితులు పోలీసుల వద్దకు వచ్చి తమ గోడు చెప్పుకొన్నారు. కాగా, పోలీసులు ఆదిత్యను తీసుకుని అద్విక కార్యాలయానికి వెళ్లారు. లోపల రికార్డులను, పెట్టుబడిదారుల వివరాలను పరిశీలించారు. ఖాతాల వివరాలు తెలుసుకున్నారు. ఆదిత్య వెనుక ఇంకా మరికొంతమంది ఉన్నారని పోలీసులు గుర్తించారు.

డిలీట్ చేసిన నెంబరెవరిది?

పోలీసుల అదుపులో ఉన్న ఆదిత్య తన భార్య సుజాతతో మాట్లాడుకుంటానని ఓ కానిస్టేబుల్‌కు చెప్పాడు. దీంతో ఆ కానిస్టేబుల్ తన సెల్ ఫోన్ ఇచ్చాడు. కొద్దిసేపు మాట్లాడిన తర్వాత డయల్ కాల్స్‌లో ఆ నెంబర్‌ను డిలీట్ చేసి ఫోన్ ఇచ్చాడు. ఇప్పుడు ఆ నెంబరు ఎవరిదన్నది ప్రశ్నగా మారింది. భార్య సుజాతతోనే మాట్లాడాడా, ఇంకెవరితోనైనా సంభాషించాడా అన్నది సస్పెన్స్‌గా ఉంది.



ఏజెంట్లకు నచ్చజెబుతున్న ఆదిత్య

'అద్విక' పేరుతో మోసం

అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యకలాపాలు ఫార్చ్యూన్ హైట్స్ మొదటి అంతస్థులో జరుగుతుండగా, అద్విక మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ అనే మరో సంస్థను గురునానక్ కాలనీలో నిర్వహిస్తున్నారు. వివిధ ప్రైవేట్ బ్యాంకుల్లో మేనేజర్ల హోదాల్లో పనిచేసిన కొంతమంది కలిసి ఈ సొసైటీని గత నవంబరులో ఏర్పాటు చేసుకున్నారు. దీన్ని ఆదిత్య తన ఖాతాలో వేసుకున్నాడు. మొత్తం 14 మంది ఒక్కొక్కరు రూ.5 లక్షల చొప్పున పెట్టుబడి పెట్టి ఈ సొసైటీ నడుపుతున్నారు. దీనికి ఉన్న అద్విక పేరు తన ట్రేడింగ్ కంపెనీ పేరుతో కలవడంతో మొత్తం ఈ సొసైటీ తనదని ఆదిత్య చెప్పుకొన్నాడు. ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన వారందరికీ ఇదే చెప్పాడు. అద్విక మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రారంభించాక బ్యాంకింగ్ రంగంలో అనుభవం ఉన్న వ్యక్తిని చైర్మన్‌గా నియమించాలని నిర్ణయించుకున్నారు. ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌లో పనిచేసిన కిరణ్ అనే వ్యక్తికి సొసైటీలోని సభ్యులు ఈ విషయం చెప్పారు. అప్పుడు కిరణ్ ఆదిత్య భార్య సుజాతను వారికి పరిచయం చేశాడు. కొటక్ మహేంద్ర బ్యాంక్‌లో గోల్డ్ లోన్ విభాగంలో పనిచేసిన అనుభవం ఉండటంతో సుజాతను చైర్మన్ చేశారు. ఈ సొసైటీ ప్రారంభోత్సవానికి ట్రేడింగ్ కంపెనీలో సభ్యులుగా ఉన్న వారందరినీ ఆదిత్య పిలిచాడు. అప్పటికే ఈ సొసైటీ తమదేనని బిల్డప్ ఇచ్చాడు. తర్వాత అద్విక మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ తనదేనని ఆదిత్య చెప్పుకొంటున్న విషయం సొసైటీ పాలకవర్గానికి తెలిసింది. దీంతో ఛైర్మన్‌గా ఉన్న సుజాతను పిలిచి అడిగారు. సొసైటీ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఐదారు సార్లు మాత్రమే ఈ కార్యాలయానికి వచ్చిన ఆమె ఏప్రిల్ 10న రాజీనామా చేసింది.

అరెస్టుకు ముందు సమావేశం

పోలీసులు అరెస్టు చేయడానికి ముందు ఆదిత్య ఏజెంట్లతో సమావేశం నిర్వహించాడు. అప్పటికే నష్టాలు ఉన్నాయని తెలిసినా ఏజెంట్లను నమ్మించే ప్రయత్నం ఈ సమావేశంలో చేశాడు. తనను నమ్మితే మొత్తం చెల్లింపులు చేస్తానని భరోసా ఇచ్చాడు. ఈ ప్రయత్నం బెడిసికొట్టింది. ఇక తాము నమ్మలేమని ఏజెంట్లు మూకుమ్మడిగా చెప్పారు. ఆ సమావేశంలో ఆదిత్య ప్రసంగ వీడియోలు 'ఆంధ్రజ్యోతి'కి అందాయి.

హవాలా మార్గంలో దుబాయికి..

పెట్టుబడులుగా వసూలు చేసిన నిధులను ఆదిత్య హవాలా మార్గంలో దుబాయికి మళ్లించినట్టు పోలీసులు గుర్తించారు. దుబాయిలో షబానా అనే ట్రేడింగ్ కంపెనీకి ఈ డబ్బు వెళ్లింది. కొద్దిరోజుల కిందట ఆదిత్య తన పుట్టినరోజు వేడుకలను వైజాగ్‌లోని స్టార్ హోటల్‌లో నిర్వహించాడు. దీనికి అక్షరాలా రూ.70 లక్షలు ఖర్చయ్యింది. విజయవాడ నుంచి ఏజెంట్లను, ఉద్యోగులను విమానంలో అక్కడికి తీసుకెళ్లాడు. అంతేకాదు.. ఆదిత్య శృంగారలీలలు కూడా బయటపడుతున్నాయి. ఆదిత్య ల్యాప్‌టాప్‌ను పోలీసులు విశ్లేషించగా, అందమైన అమ్మాయిలు, ఆదిత్య నగ్నంగా ఉన్న వీడియోలను పోలీసులు గుర్తించారు. ఈ అందమైన అమ్మాయిల ఫొటోలను ఆయన ఒక ఫోల్డర్‌లో భద్రపరిచాడు.

పేడ దిబ్బలను డంపింగ్ యార్డుకు తరలించండి

● డీఎల్‌పీవో శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పశువుల పెంపకం దారులు పేడ దిబ్బలను డంపింగ్ యార్డులకు తరలించాలని డీఎల్‌పీవో శ్రీనివాసరావు సూచించారు. ప్రత్తిపాడులోని చెత్తనుండి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రానికి పశువుల పేడను అందించే రైతులకు 200 కేజీల వర్మీ కంపోస్టు ఎరువులను ఉచితంగా ఇస్తామన్నారు. పాడి రైతులు పశువ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివపార్వతి, పంచాయతీ కార్యదర్శి ఖాజా తదితరులు పాల్గొన్నారు.


మట్టి తవ్వకాలను నిలిపివేస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి

అక్రమ మైనింగ్ నిర్వహిస్తే చర్యలు

● తహసీల్దార్ వెంటక స్వామి

కాకుమాను, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ వెంకటస్వామి హెచ్చరించారు. మండలంలోని గరికపాడులో అక్రమంగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో కలసి మైనింగ్ నిలిపివేశారు. ఈ సందర్భంగా మైనింగ్‌కు అనుమతులు ఉన్నాయా అని వాకబు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు చలపతి ఫార్మసీలో అల్ ఇండియా అండర్-19 చెస్ పోటీలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ ఎం.గోపినాథ్, నాదెండ్ల రామారావు

తాడికొండ(లాం), జూన్ 27(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో రెండు రోజుల పాటు అల్ ఇండియా అండర్ 19 చెస్, ఓపెన్ చెస్ పోటీలు జరగనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. కళాశాలలో ఆనంద్ చెస్ వింగ్స్ సహకారంతో నిర్వహించే ఈ పోటీలకు సంబధించిన పోస్టర్స్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 28, 29 తేదీల్లో ఈ పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. విజేతలకు రూ.1,20,000 నగదు బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనేవారు రూ.800 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలను ఎం.గోపినాథ్‌ను సంప్రదించాలన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

తాడికొండ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తాడికొండ గ్రామంలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 40 వేల జనాభా కలిగిన గ్రామంలో 10 రోజులకు ఒకసారి కూడా తాగునీరు అందటం లేదని తెలిపారు. ఎన్నికల హామీలో భాగంగా చంద్రబాబునాయుడు, తెనాలి శ్రావణ్‌కుమార్ తాడికొండకు తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తామని చెప్పి సంవత్సరం గడిచినా ఆ దిశగా ఎలాంటి పనులు ప్రారంభం కాలేదన్నారు. తాగునీరు సక్రమంగా రాకపోవటంతో మినరల్ వాటర్ ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, నాయకులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

బోధనేతర సిబ్బంది ఎన్నికలు ఏకగ్రీవం

లాంఫాం(తాడికొండ), జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని బోధనేతర సిబ్బందికి నిర్వహించిన ఎన్నికల్లో కే వెంకటేశ్వరరావు ప్యానెల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రిటర్నింగ్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. 9మంది సభ్యులతో కూడిన బోధనేతర సిబ్బంది కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రెసిడెంట్‌గా కే వెంకటేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఈ ఆశోక్, వైస్ ప్రెసిడెంట్‌గా టీవీ రామకృష్ణ, జనరల్ సెక్రటరీ ఎల్ సతీష్, జాయింట్ సెక్రటరీగా ఎస్.జగదీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.మౌనిక, టెక్నికల్ సెక్రటరీగా సయ్యద్ మహబూబ్ వలి, కల్చరల్, గేమ్స్ సెక్రటరీగా బీ మోహన్, ట్రెజరర్‌గా టీ శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 510 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ. 9,200, గరిష్టధర రూ.10,325, మోడల్‌ధర రూ.10.100 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ. 9,100, గరిష్టధర రూ. 10,100, మోడల్‌ధర రూ.10,200 పలికాయి.

నేడు సహస్ర దీపాలంకరణ

మంగళగిరి సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ముఖమండపంలో శనివారం సాయంత్రం స్వామివారికి సహస్ర దీపాలంకరణ ఉత్సవం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. ఈ ఉత్సవానికి మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరిస్తారన్నారు.

కరపత్రాల పంపిణీ

తాడేపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న జరిగే చలో తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ తాడేపల్లి అమరారెడ్డినగర్‌లో కేవీపీఎస్ నాయకులు, సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు తదితరులు శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. అమాయకుల పట్ల పోలీసులు చేసిన దాష్టీకాన్ని ఖండిస్తున్నామన్నారు.కార్యక్రమంలో బర్నబాసు, బాబూరావు, విజయభాస్కర్‌రెడ్డి, దుర్గారావు, దావీదు, ప్రతాప్, స్థానికులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

దుగ్గిరాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరుకలపూడి జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ పంపిన నోటుపుస్తకాలను కూటమి నాయకుల చేతులమీదుగా శుక్రవారం అందించారు. హెచ్‌ఎం కె.వెంకటేకశ్వరరావు, ఎంపీటీసీ తాళ్ల అశోక్, గోగం నాగేశ్వరరావు, మైలా వెంకటసుబ్బయ్య, పాండురంగారావు, యలవర్తి వెంకటేశ్వరరావు, తుల్లిమిల్లి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కౌలు సమస్యను పరిష్కరించాలి


సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుకు వినతిపత్రం అందజేస్తున్న రైతు జేఏసీ సభ్యులు

తుళ్లూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పదకొండో విడత కౌలు సమస్యలను పరిష్కరించాలని సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబును రాజధాని అమరావతి రైతు జేఏసీ సభ్యులు కోరారు. శుక్రవారం విజయవాడలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కలసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. 40 రోజుల్లో చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. సీడ్ యాక్సెస్ రోడ్డు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు జేఏసీ సభ్యులు కొండెపాటి బుజ్జి, గొర్నేని స్వరాజ్యరావు, జొజాల చలపతిరావు, కల్లం రాజశేఖర్‌రెడ్డి, బెజవాడ రమేష్‌బాబు ఉన్నారు.

● రాజధాని అమరావతిలోని పారిశుధ్య కార్మికుల జీతాలు పెంచాలని, వారికి అమరావతి జీవనభృతి పింఛన్, సామాజిక పింఛన్‌ను పునరుద్ధరించాలని రాజధాని పారిశుధ్య సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.రవి కోరారు. సీఆర్డీఏ కార్యాలయంలో నోడల్ అధికారి జయశ్రీకి వినతిపత్రాన్ని అందజేశారు. కూటమి ప్రభుత్వం జీతాలు పెంచుతుందని ఎదురుచూస్తే ఇంతవరకు పట్టించుకోలేదని రవి పేర్కొన్నారు.

● బోరుపాలెంలో వర్షాలు పడుతుంటే నీరు రోడ్ల మీదే నిలబడుతుందని దీంతో మురుగుచేరి రోగాలు ప్రబలుతున్నాయని సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివ శంకరావు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేలో అర్జీల స్వీకరణ

సీఆర్డీఏ తుళ్లూరు ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే సందర్భంగా నోడల్ అధికారి పి.జయశ్రీ రైతులు, రైతు కూలీల నుంచి అర్జీలు స్వీకరించారు. సీఆర్డీఏ అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరైయ్యారు. ఫిర్యాదులలో కొన్నిటిని అక్కడకక్కడే పరిష్కరించారు. గ్రీవెన్స్ డేలో మొత్తం 27 ఫిర్యాదులు అందినట్లు జయశ్రీ తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు పీ. పద్మావతి, ఏజీ. చిన్నికృష్ణ, శ్రీనివాసనాయక్, శేషిరెడ్డి, కె.స్వర్ణమేరి, భాగ్యరేఖ, భీమారావు, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ పాండురంగారావు రామకృష్ణన్, సామాజిక సంక్షేమ అధికారి బొర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకుకు యువత దూరంగా ఉండాలి


విజేతలకు బహుమతులు ఇస్తున్న వైద్యాధికారి డాక్టర్ యామిని గ్రేస్

ఫిరంగిపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగాకు వాడకం, దుష్పరిణామాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బేతపూడి, మునగపాడు గ్రామాల్లోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా విజేతలకు నుదురుపాడు వైద్యాధికారి డాక్టర్ యామిని గ్రేస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కొండపల్లి సుదర్శన్‌రాజు, ఏఎన్ఎంలు, ఆషాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొండపాడులో పారిశుధ్యం పరిశీలన

తుళ్లూరు(దొండపాడు), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొండపాడు గ్రామంలో పారిశుధ్యంపై శుక్రవారం ఎంపీడీవో కానూరి శిల్ప శుక్రవారం పరిశీలించారు. పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న వాటర్ ట్యాంకు ఇనుప నిచ్చెన ప్రమాదకరంగా ఉందని దానిని మార్చాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై సెక్రటరిని అడిగి తెలుసుకున్నారు. తాగు నీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుంటే ఆందోళన


రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘు నాయకులు

పెదనందిపాడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని కాకుమాను, పెదనందిపాడు మండల కేంద్రాల్లో ప్రభుత్వం పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకుంటే ఆందోళనబాట పడతామని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ అన్నారు. టీకేపాలెం వద్ద కొనుగోలుకేంద్రాన్ని పరిశీలించి అనంతరం తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గుంటూరు, పెదకాకాని వద్ద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడకు రైతులను పొగాకును తీసుకురవాలని చెప్పడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న రైతులకు దూర ప్రాంతాలకు పొగాకు తరలించేందుకు రవాణా భారంగా మారుతుందన్నారు. ప్రభుత్వం పొగాకు కొనుగోలుకు 100కోట్లు కేటాయించినట్లు మోసపు మాటలు చెప్పడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో రైతుసంఘ నాయకు లు కొత్త వెంకటశివరావ తదితరులు పాల్గొన్నారు.

అప్పాపురం ఛానల్ పూడిక తీత పనులు ప్రారంభం


గుర్రపు డెక్కను తొలగిస్తున్న దృశ్యం

వట్టిచెరుకూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సంగం జాగర్లమూడి సమీపంలోని పాత మద్రాసు కాలువ(కొమ్మమూరు కాలువ) నుంచి ప్రారంభమయ్యే అప్పాపురం ఛానల్ పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. రైతులు వరి సాగుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చొరవతో డీసీ చైర్మన్ ఆదేశాలతో కాల్వలో పూడిక తీతకు శ్రీకారం చుట్టారు. ముట్లూరు గ్రామ సమీపంలోని ఒకటో నెంబరు బ్రాంచ్ వరకు పూడికను తొలగించారు. సకాలంలో పూడికతీత పనులు పూర్తిచేయకపోతే అటు నారుమళ్ళు పోసుకునేందుకు ఇబ్బందులు పడతామని సత్వరం పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు. సాగునీరు అందించాలంటే పది రోజుల్లో పనులు పూర్తి చేయాలన్నారు.

యూపీహెచ్‌సీని సందర్శించిన ఏబీడీఎం బృందం


రోగులతో మాట్లాడుతున్న ఏబీడీఎం సంయుక్త కార్యదర్శి కిరణ్ గోపాల్

మంగళగిరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి గణపతినగర్‌లోని ఇందిరానగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కేంద్ర ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సంయుక్త కార్యదర్శి, మిషన్ డైరెక్టర్ కిరణ్ గోపాల్ వస్కా నేతృత్వంలోని బృందం సందర్శించింది. హెల్త్ రికార్డు నమోదు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ హెల్త్ అకౌంట్ ఐడీల గురించి ఆరా తీశారు. అనంతరం హెల్త్ సెంటరులోని వైద్య సేవల గురించి రోగులను ప్రశ్నించారు. ల్యాబ్ పరీక్షలు, ఫార్మసీని పరిశీలించారు. ఏబీడీఎం స్టేట్ మోడల్ ఆఫీసర్ బీవీ రావు, ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుస్మిత, స్టేట్ టీం మేనేజర్ యశ్వంత్, మెడికల్ ఆఫీసర్ పీ.అనూష తదితరులు పాల్గొన్నారు.

30న ఉపకార వేతనాల పంపిణీ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దోస్త్ అధ్యక్షుడు గాంధీ, జంపాల సుబ్బారావు తదితరులు

దుగ్గిరాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ నెల 30న ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు దోస్త్ స్వచ్ఛందసేవాసంస్థ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏటా దోస్త్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవాకార్యక్రమాల్లో భాగంగా జంపాల కాంప్లెక్స్‌లో ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నారై జంపాల సుబ్బారావు మాట్లాడుతూ, 30న గూడవల్లి ఎల్‌వీప్రసాద్ హాస్పిటల్ వారిచే నిర్వహించే శిబిరాన్ని దుగ్గిరాలవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గద్దె శ్రీనివాస్, చింతమనేని మహేష్, కొండపనేని రవీంద్ర, గద్దె రవీంద్ర, నిమ్మగడ్డ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

52 రోజులుగా సమ్మె.. స్పందించని ప్రభుత్వం

● సీడీఎంఏ కార్యాలయం వద్ద నిరసనలో కార్మిక జేఏసీ నేతలు

తాడేపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గత 52 రోజులుగా సమ్మె చేస్తున్నా కూటమి ప్రభుత్వం స్పందించలేదంటూ ఏపీ కార్మిక జేఏసీ నేతలు తెలిపారు. తాడేపల్లి బైపాస్ రోడ్డులోని మున్సిపల్ రాష్ట్ర కార్యాలయం వద్ద శుక్రవారం జేఏసీ ప్రతినిధులు, కార్మికులు నిరసన తెలిపారు. డిమాండ్లు పరిశీలించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. దీర్ఘకాలిక కార్మిక సమస్యలు, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 30 నుంచి అన్ని డిపార్టుమెంట్లలో పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి విచ్చేసిన మున్సిపల్ కార్మిక ప్రతినిధులు పాల్గొని నినాదాలు చేశారు.



సీడీఎంఏ కార్యాలయం వద్ద నిరసనలో పాల్గొన్న మున్సిపల్ కార్మిక జేఏసీ ప్రతినిధులు

సొసైటీ అభివృద్ధికి బయో ఫోర్ ఫౌండేషన్ చేయూత

పెదనందిపాడు, జూన్, 27(ఆంధ్రజ్యోతి): స్థానిక పెదనందిపాడు ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ అభివృద్ధికి బయో ఫోర్ ఫౌండేషన్ చేయూత అందించింది. సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఏఎస్ కళాశాల, నందిపాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సీఈవో డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు, సహాయ ఫౌండర్, సీఎస్‌వో డాక్టర్ పుల్లగూర్ల మాణిక్యరెడ్డి రూ.3,00,000 విరాళంగా పీఈడీ సొసైటీ ఖాతాకు జమచేసినట్లు ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య తెలిపారు. దాతలను కళాశాల అధ్యక్షులు కాళహస్తి సత్యనారాయణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ లావు రత్తయ్య, కోశాధికారి లావు ఆదిశేషయ్య, సభ్యులు నర్రా బాలకృష్ణ, నర్రా వీరయ్య, సుబ్బారావు అభినందించారు.

పెదనందిపాడు రోటరీక్లబ్ అధ్యక్షుడిగా చిన్నం

పెదనందిపాడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పెదనందిపాడు రోటరీ క్లబ్(నెం.3150) అధ్యక్షుడిగా చిన్నం శ్రీనివాసరావును శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక అశోకా పాఠశాలలో రోటరీ క్లబ్ కార్యవర్గ సమావేశం ప్రస్థుత అధ్యక్షులు నల్లపునేని శివప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రత్తిపాడు రెయిన్‌బో స్కూల్ డైరెక్టర్ చిన్నం శ్రీనివాసరావు, కార్యదర్శిగా పోపూరి నాగేశ్వరరావు, కోశాధికారిగా కోడూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ముళ్లపూడి చిననాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా వై కోదండరామిరెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు పోపూరి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శివాలయం భూమికి రూ.4.36 లక్షల కౌలు

దుగ్గిరాల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శ్రీగంగా పార్వతీసమేత శ్రీనాగేశ్వరస్వామి ఆలయ భూమికౌలు గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డుస్థాయిలో రూ.4.36 లక్షలు పలికింది. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్(తెనాలి) శారదాదేవి పర్యవేక్షణలో స్థానిక శివాలయంలో జరిగిన వేలంలో పలువురు రైతులు పాల్గొన్నారు. 8.87 ఎకరాల సాగుభూమి కౌలు హక్కును ఈమనికి చెందిన రైతు అక్రమశెట్టి మహేష్‌బాబు దక్కించుకున్నారు. ఈవో శ్రీనివాసరావు, అర్చకుడు యుగంధర్‌శర్మ, పసుపులేటి రవియాదవ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాగి తీగలు స్వాధీనం

తుళ్లూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాగి తీగలను కలిగి ఉన్న ఇద్దరు యువకులను తుళ్లూరు పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. రాజధాని నిర్మాణ పనులు జరిగే పరిసర ప్రాంతాల్లోని వైరు ముక్కలను ఏరుకొని వాటిని కాల్చి అందులో వచ్చిన రాగిని సమీకరించి అమ్ముకోవాలని చూడగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిని తహసీల్దారు సుజాత ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు.

ఘనంగా వీర్లంకమ్మతల్లి తిరుణాళ్ల

పెదనందిపాడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోగులమూడిలో వీర్లంకమ్మతల్లి తిరుణాళ్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పొంగించి, చద్దులు చెల్లించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామస్థులు, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

కాకుమాను, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెంకట స్వామి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రేషన్ డీలర్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, వికలాంగులకు ఇంటివద్దే రేషన్ పంపిణీ కార్యక్రమం అమలుపై ఆరా తీశారు. ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు సమయపాలన పాటించి లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. దుకాణాల వద్ద విధిగా స్టాక్‌బోర్డుల ఏర్పాటు, నూరు శాతం పంపిణీ లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు.


ఏపీ ఎన్ఆర్‌టీ సొసైటీ అధ్యక్షుడిగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వేమూరి రవికుమార్‌ను మంగళగిరి ఆటోనగర్‌లోని వీవర్‌శాల కమిటీ సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు, పొట్లాబత్తుని లక్ష్మణరావు, శాంతి, శ్రీకాంత్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. -మంగళగిరి


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న జయసత్య, నేతలు

ఎర్రబాలెంలో సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

మంగళగిరి సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కును స్థానిక నేతలు శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన చెల్లంశెట్టి వెంకట సుజాతకు రూ.41,012ల చెక్కు మంజూరు కాగా, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు నేతలు సుజాత ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆకుల జయసత్య, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, కూటమి నేతలు ఆకుల ఉమామహేశ్వరరావు, నీలం అంకారావు, ఆకుల పానయ్య, గడదాసు రంగారావు, సత్యనారాయణ, ఫిరోజ్, సాలి నరేష్, కానుకొలను సుబ్బారావు, ఆర్ధల పిచ్చియ్య, పద్మజ, చింతా జగన్, గోపయ్య, దానబోయిన శంకర్‌రావు, బొందలపాటి రాజ్యలక్ష్మి, లేళ్ల సాయినందన్, బత్తినేని అంజయ్య, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

మంగళగిరిలో...


లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. 20వ వార్డుకు చెందిన పేండ్ర జ్యోతికి రూ.4,59,720, 18వ వార్డుకు చెందిన బిట్రా రమ్యకు రూ.2,36,943, 19వ వార్డుకు చెందిన దామర్ల కుమారికి రూ.1,32,157, 30వ వార్డుకు చెందిన రుద్రు దివ్యకు రూ.1,36,707, 29వ వార్డుకు చెందిన షేక్ జాహిదాకు రూ.65,300, 21వ వార్డుకు చెందిన బట్టు మధుసూదన్‌రావుకు రూ.43,756, 15వ వార్డుకు చెందిన నందిగం మేరీకి రూ.36,500, 17వ వార్డుకు చెందిన కగ్గా సీతామహాలక్ష్మీకి రూ.25,541 చొప్పున మంజూరయ్యాయి. స్థానిక టీడీపీ నాయకులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు బట్టు చిదానందశాస్త్రి, బట్టు మోహన్, తేలు వెంకటేశ్వరరావు, గుడిపూడి శివకృష్ణ, పాలడుగు ఏసు, నక్కా రాజశేఖర్, మునగపాటి శివనాగేశ్వరరావు, కగ్గా వెంకటరావు, ముదిగొండ లక్ష్మణరావు, బిట్రా దుర్గారావు, మాల్యాద్రి, బైరబోయిన శ్రీనివాసరావు, బైరబోయిన శంకర్, కాకర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

పెదవడ్లపూడి గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా శివరామయ్య


యేళ్ల శివరామయ్యను అభినందిస్తున్న జవ్వాది కిరణ్‌చంద్ తదితరులు

మంగళగిరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామ తెలుగుదేశం పార్టీ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యేళ్ల శివరామయ్య, ఉపాధ్యక్షులుగా యేమినేని సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కొడవలి ఆనంద్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా షేక్ బాజీ, కట్టా దుర్గారావు, నూతక్కి రాజశేఖర్, కార్యదర్శులుగా గుడిమెట్ల మల్లేశ్వరరావు, పాములూరి కోటేశ్వరరావు, కొండపల్లి కిషోర్, కోశాధికారిగా వెలగపూడి బ్రహ్మాజీలను ఎన్నుకున్నట్టు ప్రకటించారు. నూతన కమిటీకి మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, మండల టీడీపీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్‌చంద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పరిపాలన సాగిస్తుందన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం, అమరావతి అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, టీడీపీ నేతలు మాదల రమేష్ బాబు, మల్లవరపు వెంకట్, గాదె పిచ్చిరెడ్డి, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, అన్నే చంద్రశేఖర్, గుడిమెట్ల మరియదాసు, గడ్డిపాటి అపర్ణ, బుర్రా ధనరాజ్, మీనగ వెంకటేశ్, షేక్ బాజీవలి, జాలాది సందీప్, కంచర్ల బుల్లిబ్బాయ్, జవ్వాది రామారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపై దృష్టి పెట్టాలి

● ఎంపీడీవో యుగకీర్తి

కాకుమాను, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్యం మెరుగుదలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని ఎంపీడీవో యుగకీర్తి అన్నారు. మండల పరిధిలోని అప్పాపురం, చిన్నకాకుమానులో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. అప్పాపురంలో చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించడం లేదని, గ్రీన్ అంబాసిడర్ ఒక్కరే ఉన్నారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల కిందట జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీపీవో సాయికుమార్, డీఎల్‌పీవో స్వరూపరాణిలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అయితే పంచాయతీ రాజ్ కమిషనర్ వస్తున్నారనే సమాచారంతో ఎంపీడీవో యుగకీర్తి గురువారం రాత్రి కూడా గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు దగ్గరుండి చేయించారు. శుక్రవారం వేకువజామునే గ్రామానికి విచ్చేశారు. గ్రామంలో బీసీ కాలనీలో, శ్మశానానికి వెళ్లే మార్గంలో రోడ్లుకు ఇరువైపులా ఉన్న మట్టి కుప్పలను, మురుగుకాలువలో ఉన్న వ్యర్థాలను ప్రొక్లెయిన్ ద్వారా తొలగించారు. అనంతరం చిన్న కాకుమానులో సీసీ డ్రెయిన్‌లో వ్యర్థాలను కూడా రేటూరు, అప్పాపురం గ్రామాల పారిశుధ్య కార్మికులను ఉపయోగించి తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ రవీంద్రరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, ఈవోపీఆర్డీ రవికుమార్, అప్పాపురం, రేటూరు, కొండపాటూరు, కోతివానిపాలెం పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, శివ ప్రసాద్, రామకృష్ణారెడ్డి, విక్టర్ డానియేల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


విజయవాడ ఎంజేనాయుడు ఆస్పత్రి సౌజన్యంతో శుక్రవారం ఎర్రబాలెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, టీడీపీ, జనసేన నేతలు వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. -మంగళగిరి సిటీ

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నేటి నుంచి రథ్ ఫెస్ట్

తెనాలి అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ ఆధ్వర్యంలో చేపట్టిన రథ్ ఫెస్ట్ శనివారం ప్రారంభం అవుతుందని సంస్థ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 30న జరగనున్న జగన్నాథ రథయాత్ర పురస్కరించుకుని రెండు రోజుల పాటు వైకుంఠపురం ఆలయంలో 51 విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. సంగీతం భగవద్గీత, చిత్రలేఖనం, పెయింటింగ్, క్రాఫ్ట్ పోటీలు శనివారం జరుగుతాయి. నాట్యం, మోనో యాక్షన్, క్విజ్, ఫ్యాన్సీ డ్రస్, స్పీకింగ్, రైటింగ్ పోటీలు ఆదివారం నిర్వహిస్తారు. 5 నుంచి 29 ఏళ్ల వయసు వారు ఎవరైన పాల్గొనవచ్చని ఇప్పటికే వెయ్యి మంది నమోదు చేసుకున్నారని తెలిపారు.

సాగుకు సమాయత్తం


పొన్నూరు సమీపంలో దుక్కిదున్నతున్న ట్రాక్టర్

● విత్తనాలు, ఎరువులు సిద్ధం

పొన్నూరు టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. పొన్నూరు సబ్ డివిజన్ పరిధిలో పంటల సాగుకు వ్యవసాయశాఖ రైతులు సైతం సమగ్ర ప్రణాళికలు రూపొందించారు. పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, రైతుల అవసరాల మేరకు అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించడంతో పాటు విత్తనాలను రైతు సేవా కేంద్రాలలో పంపిణీ ప్రారంభించారు. పొన్నూరు సబ్ డివిజన్ పరిధిలో 27,434 హెక్టార్‌లలో పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు.

ఖరీఫ్‌లో వరి పంటే

పొన్నూరు సబ్ డివిజన్ పరిధిలో మూడు మండలాలు ఉండగా 27 హెక్టార్‌లలో ప్రధానంగా వరి పంటనే రైతులు సాగు చేస్తారు. పొన్నూరు మండలంలో 12,028 హెక్టార్లలో, చేబ్రోలు మండలంలో 5840 హెక్టార్లు, కాకుమాను మండలంలో 9566 హెక్టార్లలో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. ఇప్పటికే పొన్నూరు మండలంలో 1450, చేబ్రోలులో 800, కాకుమానులో 1150 మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేశారు. అలాగే పంట భూములకు అవసరమైన పోషకాలు అందించేందుకు 2069 క్వింటాళ్ల పచ్చిరొట్ట పైర్ల విత్తనాల పంపిణీ కార్యక్రమం అధికారులు చేపట్టారు. రూ.33లక్షల విలువైన పిల్లిపెసర విత్తనాలు, అధికారులు రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేశారు.

విత్తనాలు, ఎరువులే ప్రధాన అవసరం

ఖరీఫ్‌ల పంటల సాగుకు ప్రధానంగా అధికారులు రాయితీపై విత్తనాలను పంపిణీ ప్రారంభించారు. అంతే కాకుండా రైతులకు అవసరమైన బీపీటీ, ఎంటీయూ వంటి రకం ధాన్యం విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. పొన్నూరు మండలంలో 7472, క్వింటాళ్లు, చేబ్రోలు మండలంలో 3508 క్వింటాళ్లు, కాకుమాను మండలంలో 5833 క్వింటాళ్ల వరి విత్తనాలు మొత్తం 16,813 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. రైతుసేవా కేంద్రాల ద్వారా 2055 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ జరుగుతుండగా ప్రైవేట్ వ్యాపారుల వద్ద 7624 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. అలాగే 175 మెట్రిక్ టన్నుల జింకు సల్ఫేట్ అవసరమని అధికారులకు నివేదించారు. సూక్ష్మ పోషక లోపాల నివారణకు జింక్ సల్ఫేట్ సరఫరా చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలను అందజేశారు. అలాగే 5171 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ప్రైవేట్ వ్యాపారుల వద్ద 694 మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధం చేసినట్లు చెప్పారు. సాగుకు అవసరం అయిన రూ.కోటి వ్యయంతో 266 వ్యవసాయ యంత్రాలను రూ.39 లక్షల సబ్సిడీతో పంపిణీ చేశారు.

వరి వెద సాగుకు ఆసక్తి

పొన్నూరు మండలంలో వెద వరిసాగుకు రైతులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. మండలంలోని అనేక గ్రామాలలో భూగర్భ జలాలు అందుబాటులో ఉండడంతో రైతులు వెద వరికే మొగ్గు చూపుతున్నారు. జూలై మొదటి వారంలో వెద పద్ధతిలో వరి విత్తనాలు నాటేలా ఇప్పటికే దుక్కులు పూర్తిచేశారు. అంతేకాకుండా సంప్రదాయ పద్ధతిలో సాగుచేసే పంట భూములలో నారుమడులు సిద్ధం చేస్తున్నారు. జూలై మొదటి వారంలో ప్రభుత్వం సాగుకు కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. పొన్నూరు మండలంలో సుమారు ఆరు వేల హెక్టార్‌లలో వెద పద్ధతిలో వరి నాటేందుకు రైతులు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఈ పద్ధతిలో సాగు వ్యయం గణనీయంగా తగ్గుతుండటంతో పాటు పదిహేను రోజుల పంట కాలం కలిసి రావడం, అధిక దిగుబడులు వస్తుండటంతో రైతులు వరి వెదకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. సాగు ప్రణాళికపై వ్యవసాయశాఖ ఏడీఏ రామకోటేశ్వరిని వివరణ కోరగా రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, విత్తనాలు, సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. రైతులు కూడా వ్యవసాయశాఖ సూచనలకు అనుగుణంగా విచ్చలవిడిగా ఎరువులు వినియోగించకుండా పంట సాగు చేయాలని సూచించారు.

కొల్లిపర మండలంలో...

కొల్లిపర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): డెల్టాలో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పొలాలు దుక్కిచేసి నారు మళ్లు పోసేందుకు, వెదపద్ధతిలో నాట్లు వేసేందుకు భూములను సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు పడటంతో పాటు వాతావరణం అనుకూలించడంతో వ్యవసాయ పనులపై రైతులు దృష్టిసారించారు. గత సంవత్సరం వరిలో మంచి దిగుబడులు రావడంతో ఈ సంవత్సరం కూడా అధిక దిగుబడులు సాధించేందుకు ముందుగా మేలురకం విత్తన సేకరణకు రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. మండలంలో ఎక్కువ శాతం మంది రైతులు బీపీటీ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. విత్తనాలు సమకూర్చుకుని ఉంటే అదను రాగానే నారుమళ్ళు పోయాలన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. గత సంవత్సరం మాగాణిలో వరి తర్వాత రెండో పంటగా మొక్కజొన్న, జొన్నను రైతులు అధిక విస్తీర్ణంలో సాగుచేశారు. మొక్కజొన్నకు నీటి తడులు ఎక్కువగా అందించటంతో భూములు గుల్లబారిఉన్నాయి. దీంతో కొంతమంది రైతులు రొటావేటర్‌తో భూములను చదును చేస్తున్నారు. మరికొంతమంది రైతులు పశువుల ఎరువును చల్లి ట్రాక్టర్ల ద్వారా దుక్కులు చేయడానికి సిద్ధమవుతున్నారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు మేరకు పోషక విలువలు కలిగిన ఎరువులను భూమికి అందించే ఆలోచనతో రైతులు ఉన్నారు. వరిపైరుకు సక్రమంగా నీరు అందించటానికి బోదె కాల్వలను రైతులు బాగు చేస్తున్నారు. అదేవిధంగా మెట్ట భూములు వర్షానికి బాగా తడిసి అదునుగా ఉండటంతో రైతులు దుక్కులు ప్రారంభించారు. వాణిజ్య పంటలైన పసుపు, కంద, అరటి సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. కందకు మార్కెట్‌లో రైతులు ఆశించిన ధర ఉండటంతో ఆ పంటను వేయటానికి ఎక్కువమంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. మంచి విత్తనాన్ని ఎంచుకుని సాగు చేసేందుకు చర్యలు చేపట్టారు.


కొల్లిపర సమీపంలోని భూముల్లో పశువుల ఎరువును చల్లుతున్న రైతులు

మున్సిపల్ ఎంహెచ్‌వోగా ఏసుబాబు బాధ్యతల స్వీకారం



తెనాలి, మారీసుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెనాలి పురపాలక సంఘ నూతన మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా ముమ్మా ఏసుబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అమర్తలూరు పీహెచ్‌సీ వైద్యధికారిగా పనిచేశారు. తెనాలి పురపాలక సంఘానికి మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా డిప్యుటేషన్‌పై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావును కలసి పుష్పగుచ్ఛం అందించారు.

'9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి'

తెనాలి అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి కోరారు. చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని కోరుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సునీత, కనకదుర్గ, పుష్ప, రషియా పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

తెనాలి అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం అంగలకుదురు ముక్తి హాస్టల్‌లో శుక్రవారం క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్ అనీల్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 2030 నాటికి క్షయలేని దేశంగా ప్రకటించేందుకు ప్రయత్నిస్తుందని చెప్పారు. ఇందుకోసం ఈ వ్యాధి విస్తరించకుండా ప్రజలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. పి.రవికుమార్, సౌజన్య, మైఖేల్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠపురంలో మహిళల కోలాట ప్రదర్శన

తెనాలి అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం ఆలయంలో మహిళలు శుక్రవారం కోలాట ప్రదర్శన చేశారు. అత్తోటకు చెందిన అంకమ్మతల్లి కోలాట దళం ఆధ్వర్యంలో స్వామివారిని కీర్తిస్తూ కోలాటం ఆడారు. జానపద కళలు మరుగున పడిపోతున్న తరుణంలో వారిని ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఈవో అనుపమ తెలిపారు. లక్ష్మీతిరుపతమ్మ, అరుణ, మంగమ్మ, సత్యనారాయణ, సునీత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ప్రతినిధుల నియామకం

తెనాలి అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ పట్టణ కన్వీనర్లుగా షేక్ నఫీజ్, షేక్ దావూద్‌లను నియమించారు. ఫ్రంట్ అధ్యక్షుడు షేక్ ఖలీల్ చినరావూరులోని కార్యాలయంలో శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. ముస్లింల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో రికార్డులను, విద్యార్థుల హాజరుపట్టీలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

పారిశుధ్య పనుల పరిశీలన

తెనాలి, మారీసుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు తనిఖీ చేశారు. శుక్రవారం 10, 11వ వార్డుల్లో జరుగుతున్న స్పెషల్ శానిటేషన్ పనులను లక్ష్మీపతిరావు అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

అదుపుతప్పిన టూరిస్ట్ బస్సు

పెదకాకాని, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): యాత్రికులతో బయలుదేరిన టూరిస్ట్ బస్సు అదుపుతప్పి ప్రమాదానికి గురైన సంఘటన శుక్రవారం పెదకాకాని సమీపంలోని హైవేపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం తునికి చెందిన మొత్తం డ్రైవర్‌తో సహా 39మంది అరుణాచలం వెళుతున్నారు. మార్గమధ్యలో పెదకాకాని సమీపంలోని నంబూరు అడ్డరోడ్డు వద్ద డ్రైవర్ రామలింగేశ్వరరావుకు కళ్ళు తిరగడంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో బస్సులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. పెద్ద ప్రమాదం తప్పిపోవటంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఎన్వీఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం నియోజవర్గ పార్టీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన నియోజకవర్గ పరిశీలకులు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, వేమలపల్లి బుజ్జి, ఏ.అశోక్‌లతో కలిసి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ భవిష్యత్తు కార్యచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గత వైసీపీ అరాచక ప్రభుత్వ పాలనకు చరమగీతం పాడి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత టీడీపీ కార్యకర్తలదేనన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడటానికి కృషిచేసిన కార్యకర్తలు అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఏ నమ్మకంతో ఐతే ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారో అంతే నమ్మకంతో కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ఏడాదిపాలన పూర్తి చేసుకుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమం పేరుతో దోపిడీ జరిగిందని ఆరోపించారు. అమ్మ ఒడి పేరిట పేదల కుటుంబాల్లో ఇద్దరు పిల్లలుంటే ఒక్కరికే ఇచ్చారని, విద్యుత్ చార్జీలు పెంచి బిల్లుల నెపంతో అదికూడా కోత విధించారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మంత్రి నారా లోకేశ్ చదువుకునే పిల్లలు ఎందరుంటే అందరికీ తల్లికి వందనం పేరిట విద్యకు అయ్యేఖర్చు జమచేశారన్నారు. వైసీపీ అరాచక పాలనతో రాష్ట్ర ఖజానా ఖాళీ చేసినా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎంత కష్టమైనా సరే బిడ్డల భవిష్యత్తుకు తల్లికి వందనం అమలు చేయాలని ప్రభుత్వం సంకల్పించి నిబద్ధతతో అమలు చేసిందన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వ పాలనలో పేదరిక నిర్మూలన కూడా జరగనుందని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వ సిద్ధాంతాలను తూచాతప్పకుండా పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. నియోజవర్గంలో కేడర్‌లో కొంత అసంతృప్తి ఉందని దానిని త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. నియోజవర్గ సమస్యలను పెద్దల వద్ద ప్రస్తావించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. త్వరలోనే నియోజకవర్గంలో మండల స్థాయి నాయకత్వాన్ని ప్రకటించనున్నట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులందరూ ఐకమత్యంతో ఉంటూ రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. చిన్న చిన్న మనస్పర్థలు పక్కనపెట్టి నియోజకవర్గ అభివృద్ధిపై, ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలని ఆలపాటి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, బాబు, గోళ్ల ప్రభాకర్, కేసన కోటేశ్వరరావు, తాడిబోయిన హరిప్రసాద్, బొన్నాదుల మహేష్, వంగాసాంబిరెడ్డి, పెండ్యాల వెంకట్రావు, కంచర్ల ఏడుకొండలు, మాదల కోటేశ్వరరావు, పసుపులేటి త్రిమూర్తి, మహమ్మద్ ఖుద్దుస్, మంగమూరి హరిబాబు, పెద్దసంఖ్యలో పార్టీనాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టండి

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్


సభలో సమస్యలు తెలుపుతున్న సభ్యులు,పాల్గొన్న ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, ఎంపీడీవో దీప్తి

తెనాలి రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధుల వెంట కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయని వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని పలువురు ఎంపీటీసీలు కోరారు. శుక్రవారం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్యసమావేశం ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవుల అధ్యక్షతన జరిగింది. సభలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పలు సమస్యలను అధ్యక్షునికి విన్నవించారు. కొలకలూరు, నందివెలుగు, కఠెవరం వంటి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఫలితంగా గ్రామాల్లో అంధకారం అలుముకుంటూ గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పలు విద్యుత్ స్తంభాలు డ్రెయిన్ల మధ్యలో ఉన్నాయని వివరించారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం విద్యుత్ అందేలా చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని కోరారు. అదేవిధంగా కోపల్లె, కొలకలూరు గ్రామ ఎంపీటీసీలు పెరిగిన వాహనాలకు తగ్గట్టుగా రోడ్లు వెడల్పు చేయకపోవడంతో నిత్యం ఆయా రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. తహసీల్దార్ గోపాలకృష్ణ ఈ విషయంపై మాట్లాడుతూ కొలకలూరు వంటి గ్రామాల్లో ఆర్అండ్‌బీ స్థలాలను పలువురు ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. త్వరలోనే వాటిని ఖాళీ చేయించి రోడ్ల వెడల్పు పనులుచేపట్టి ప్రమాదాల నివారణకు సహకరిస్తామని బదులిచ్చారు. గుడివాడ గ్రామానికి సంబంధించి ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచడంతో పాటు రిక్వెస్ట్ స్టాప్‌లను కూడా పెంచి ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అదేవిధంగా నందివెలుగు గ్రామ పంచాయతీ పరిధిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రామమందిరానికి సంబంధించిన స్థలంలో (సుమారు ముప్పై గజాల స్థలాన్ని) మరుగుదొడ్లు, ట్యాంక్ వంటివి నిర్మించారని తిరిగి ఆ స్థలాన్ని మందిరానికి అందించేలా చూడాలని నందివెలుగు ఎంపీటీసీ వినతిపత్రం అందించారు.

ఎంపీడీవో దీప్తి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి సమస్యను తప్పనిసరిగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు తెలిపిన ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టిపెడతామన్నారు. రోడ్ల వెడల్పుపై మంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, ఏవో అచంట శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాశాల నుంచి వచ్చే వ్యర్థ జలాలను అరికట్టాలని రైతుల నిరసన


కళశాల నుంచి వస్తున్న వ్యర్థ జలాల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నారాకోడూరు వద్ద నున్న ప్రైవేట్ కళాశాల నుంచి వచ్చే వ్యర్థ జలాలతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు నిరసన తెలిపారు. నారాకోడూరు సమీపంలోని సెయింట్ మేరీస్ కళాశాల నిర్వాహకులు కళాశాల నుంచి వచ్చే వ్యర్థ, మురుగు నీటిని రైతుల వ్యవసాయ భూములు, డొంకల్లోకి వదిలి వేస్తున్నారని రైతులు ఆందోళన చేశారు. మురుగు నీటి వలన పంటలు పండక పంట పొలాలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే రైతులను కళాశాల నిర్వాహకులు దౌర్జన్యం చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

స్వచ్ఛ గ్రామాల కోసం సహకారం అందించాలి

● జడ్పీ సీఈవో జ్యోతిబసు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 27: ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకారం అందించాలని జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు అన్నారు. మండల పరిధిలోని వేజెండ్లలో శుక్రవారం సీఈవో జ్యోతిబసు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలను కలుసుకుని చెత్త నిర్వహణపై ఆరా తీశారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఘన వ్యర్థాల నిర్వహణ చెత్త సేకరణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలతో మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వచేసి పంచాయతీ సిబ్బందికి ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులతో సమావేశమై చెత్త సేకరణ గురించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ హైమావతి, ఎంపీడీవో ఊహారాణి, శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు వేణుగోపాలరావు, శిరీష, తదితరులు పాల్గొన్నారు.


రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

నిర్ణీత సమయంలో రేషన్ పంపిణీ చేయండి

● తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని తహసీల్దార్ గోపాలకృష్ణ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో గోపాలకృష్ణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా డీలర్ల ద్వారానే రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. డీలర్లు తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ నిబంధనలకు అనుగుణంగా కార్డుదారులకు సరుకులు అందించాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఈ నెలాకరులోగా రేషన్ సరుకులు ఇంటి వద్దనే అందించే ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. షాపుల వద్ద తప్పనిసరిగా డీలర్ల పేరు, షాపు నెంబరు, ఫోన్ నెంబరు, తహసీల్దార్ నెంబరు కనిపించేలా ఏర్పాట్లు చేయాలని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి డీలర్లపై ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. మండలంలోని రేషన్ షాపుల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

పొన్నూరు టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జియావుల్ హక్ హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రేషన్ డీలర్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, వికలాంగులకు ఇంటివద్దే రేషన్ పంపిణీ కార్యక్రమం అమలుపై ఆరా తీశారు. ప్రతి నెల 1 నుంచి 15 వరకు సమయపాలన పాటించాలని ఆదేశించారు. దుకాణాల వద్ద విధిగా స్టాక్‌బోర్డుల ఏర్పాటు, నూరుశాతం పంపిణీ లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. పంపిణీ సమయంలో డీలర్‌లు గ్రామాలు విడిచి తహసీల్దార్ అనుమతి లేకుండా వెళ్లకూడదని హెచ్చరించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, సీఎస్‌డీటీ మాచిరాజు వెంకట్రావు, ఆర్‌ఐ శ్రీనివాస్, పట్టణ, మండలానికి చెందిన రేషన్‌డీలర్‌లు, పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పచ్చదనం, పరిశుభ్రత

● ఎంపీడీవో దీప్తి

తెనాలి రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామంతోనే పచ్చదనం, పరిశుభ్రతలకు నిలయాలుగా గ్రామాలను తీర్చిదిద్దేందుకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో అత్తోట దీప్తి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని బుర్రిపాలెంలో జరుగుతున్న శానిటేషన్ పనులను ఈవోపీఆర్డీ వైవీడీ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్ల వెంబడి గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను చూసి పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటరీ సిబ్బందితో వాటిని డంపింగ్ యార్డుకు తరలించేలా ఆదేశాలిచ్చారు. కాలువల నిర్వహణ వంటి వాటిపై పంచాయతీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ చెత్తను తప్పనిసరిగా డస్టుబిన్‌లలో నింపి ప్రతి రోజు వచ్చే పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే కాలువల పూడికతీత పనులు చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భావితరాలకు ఆరోగ్యం

● ప్రకృతి వ్యవసాయం గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి శైలేంద్ర

కొల్లిపర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క రైతు ప్రకృతి వ్యవసాయంతో భావితరాలకు మంచి ఆరోగ్యాన్ని అందివ్వచ్చని ప్రకృతి వ్యవసాయం గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి శైలేంద్ర అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దావులూరిపాలెంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆయన పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న పంటల విధానం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శైలేంద్ర మాట్లాడుతూ రసాయన, పురుగు మందులు లేని విషరహిత ఆహారం అందించడంలో ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వలన రోగాల బారినపడకుండా ఉండటానికి అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రతి కుటుంబం కూడా కావలసిన ఆకుకూరలు, కూరగాయలను పెరటిలో పండించుకుని తింటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయాధికారులు ముకేష్, లక్ష్మీదుర్గ, పి. సత్యన్నారాయణ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

● మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి


కొల్లిపరలో రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏవో శ్రీనివాసరెడ్డి

కొల్లిపర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రైతులు సబ్సిడీపై ఇస్తున్న వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర రైతు సేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. వరి విత్తనాలు నాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 25 కేజీల బస్తా ధర రూ.1075లు ఉండగా రైతులకు సబ్సిడీపై రూ.950లకు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భీమవరపు కిశోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారులు, వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన సీపీఐ నిరంతరం పోరాటం

● జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

పొన్నూరు టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన భారతీయ కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. సీపీఐ కార్యాలయంలో శుక్రవారం పట్టణ మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అజయ్‌కుమార్ మాట్లాడుతూ 1925లో ప్రారంభం అయిన సీపీఐ శత వసంతాలుగా బడుగు, బలహీన, కార్మిక, రైతు వర్గాల కోసం పోరాడుతుందన్నారు. సమావేశంలో ప్రజా నాట్యమండలి జిల్లా కార్యాదర్శి ఆరేటి రామారావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సత్యనారాయణ, ఏడుకొండలు, భవాని, నారాయణమ్మ, సుగుణ, తదితరులు పాల్గొన్నారు. పట్టణ నూతన కార్యదర్శిగా ఆరేటి రామారావును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం: శివాజీ

పెదకాకాని, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సుందరయ్య కాలనీ, స్వర్ణపురి కాలనీ, ఎస్టీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, వడ్డెర కాలనీలోని ప్రభుత్వ స్థలాలలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న వారికి ఇంటి పట్టాలు ఇచ్చేవరకు పోరాటం చేస్తామని మండల సీపీఎం కార్యదర్శి నన్నపనేని శివాజీ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రమైన పెదకాకానిలోని సుందరయ్య కాలనీలో ర్యాలీ నిర్వహించి, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.బాబురావు, బి.సాంబయ్య, యు.శివయ్య, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.